



డ్రోన్ల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పిస్తూ..

• కొత్త ఆలోచన బాస్..

ఆకాశమే హద్దుగా..



డ్రోన్ల సమ్మిట్‌లో అద్భుతాల ఆవిష్కరణ

కొత్తరకం డ్రోన్లతో ఆకట్టుకున్న యువతరం

ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం.. అందుకు అనుగుణమైన డ్రోన్లు

అనుభవాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్న ఔత్సాహికులు

ఆకాశమే హద్దుగా యువతరం దూసుకెళ్తోంది. వ్యవసాయంలో రైతుల కష్టాలను చూసి రైతుబిడ్డలు, ప్రకృతి వైపరీత్యాల్లో సత్వర చర్యలకు సేవాతత్పరులు.. ఇలా తమలోని నైపుణ్యంతో అద్భుతాలను కళ్లముందుంచారు. మంగళగిరి వేదికగా బుధవారం జరిగిన అమరావతి డ్రోన్ సమ్మిట్ -2024 వారి కష్టాన్ని, సాధించిన ఘనతను ప్రపంచానికి తెలియజేయగా, వారి ఆనందాన్ని, కష్టాల వెనుక ఉన్న నేపథ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తెలుసుకుంది. - విజయవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి)

రైతుల కష్టాలు తీర్చేందుకు..



మాది ఉయ్యూరు పక్కన నెప్పల్లి గ్రామం. రైతు కుటుంబం. ఎరువులు, పురుగు మందులు చల్లేటప్పుడు రైతులు, కూలీలు పడే కష్టం, జరిగే ప్రాణాంతక ప్రమాదాలు చూశా. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చేశాను. నా చదువు వ్యవసాయానికి ఉపయోగపడాలని ఆలోచించా. మా ఫ్రెండ్ కమల్ తోడుగా నిలిచాడు. ఇద్దరం కలిసి హైబ్రిడ్ ఇంజన్ డ్రోన్‌ను సిద్ధం చేశాం. దానితో రోజూ 30 ఎకరాల్లో సులువుగా ఎరువులు, పురుగు మందులు చల్లవచ్చు. డ్రోన్లు కొనలేని వారికి కూడా మేం సేవలందిస్తున్నాం. ఇప్పటికి 25 వేల ఎకరాల్లో డ్రోన్లతో సేవలు చేశాం. వరదల్లో చిక్కుకున్న విజయవాడవాసులకు లాజిస్టిక్ డ్రోన్ల ద్వారా ఆహార పొట్లాలు, నీళ్లు, అత్యవసర మందులు అందజేశాం. ఇప్పటి వరకూ మాదే హైబ్రిడ్ డ్రోన్ అని గర్వంగా చెప్పుకొంటాం.

- గోపీ వెంకటకృష్ణ, ఉయ్యూరు

అవయవాల తరలింపు కోసం..



కిలో.. రెండు కిలోలు మోసే డ్రోన్లు కాకుండా 7 కిలోల పేలోడ్ ఉండేలా డ్రోన్ రూపొందించాం. ఇందులోని బ్యాగులో మైనస్ 1 నుంచి మైనస్ 3 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ చల్లదనం ఉంటుంది. అందువల్ల అత్యవసర మందులు, మానవ అవయవాలు భద్రంగా, వేగంగా తరలించవచ్చు. వేగం కూడా గంటకు 125 కిలోమీటర్లు ఉంటుంది. ఒకసారి చార్జ్ చేస్తే 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు.

- ఏకాంత్, తంజావూర్

తేలిగ్గా.. సులభంగా..



మేం ఎస్సార్ఎం కాలేజీలో చదువుతున్నాం. అత్యవసర మందులు అందించేందుకు వీలుగా డ్రోన్లు రూపొందించాం. సెల్‌ఫోనులో వినియోగించే బ్యాటరీకి రెట్టింపు సైజులో.. అంటే 10వేల ఎంఏహెచ్ బ్యాటరీతో నడిచే తేలికపాటి డ్రోన్‌ను రూపొందించాం. దాన్ని అందించడానికి ఒక వెబ్ ఇంటర్‌ఫేజ్‌ను ఏర్పాటుచేసి, ఆటోమేటిక్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటుచేసి 10 కిలోమీటర్ల పరిధిలో మందులు అందించేందుకు వీలుగా డ్రోన్ రూపొందించాం. మా మోడల్‌కు ఆమోదం లభిస్తే సేవలు మొదలుపెడతాం.

- మణికంఠ, పుష్పక్, అజిత్

గృహ నిర్మాణశాఖలో వసూల్‌రాజా



జిల్లా గృహ నిర్మాణశాఖ కార్యాలయం

ఉద్యోగుల ఈపీఎఫ్ నగదు విడుదలలో అవినీతి

- ముడుపులు ఇవ్వనివారి ఫైళ్లలో కొర్రీలు
- పీడీ, ఏఈలు, ఇతర ఏ సిబ్బందైనా ఇచ్చుకోవాల్సిందే..
- చక్రం తిప్పుతున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి

ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా ఫలితం శూన్యం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో ఈపీఎఫ్ (ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్)కు సంబంధించిన వ్యవహారాలను చూసే విధులను ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి అప్పగించారు. గతంలో గృహనిర్మిత కేంద్రం వద్ద ఎన్ఎంఆర్ పద్ధతిలో వాచ్‌మెన్‌గా చేరిన ఈ ఉద్యోగి అప్పటి అధికారుల అండతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా మారాడు. కార్యాలయంలో ఉద్యోగులకు సంబంధించిన ఈపీఎఫ్ ఖాతాలను చూసే సీటును దక్కించుకున్నాడు. అతని బంధువు ఒకరికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించుకున్నాడు.

> జిల్లా గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతోంది. ఈ శాఖలో పనిచేసి, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల ఫైళ్లను చూసే ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి డబ్బుకోసం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. తనను ప్రసన్నం చేసుకోకుంటే ఈపీఎఫ్ ఖాతాల వివరాల్లో కొర్రీలు పెడుతున్నాడు. ఫలితంగా పదవీ విరమణ చేసినా పీఎఫ్ అందక చాలామంది ఉద్యోగులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సదరు ఉద్యోగి తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో మార్పులేదు.

వసూళ్లు ఇలా..

2023-24 సంవత్సరంలో గృహ నిర్మాణశాఖలో అధికశాతం మంది ఉద్యోగులు పదవీవిరమణ చేశారు. వీరు ఎప్పుడు ఉద్యోగంలో చేరారు, ఎప్పుడు పదవీ విరమణ చేశారు, జీతాల్లో నుంచి నెలనెలా ఎంత మొత్తంలో నగదు జమ అయ్యిందనే అంశంపై పూర్తి వివరాలను తయారుచేసి గుంటూరులోని

మిగతా 6లో..

ఉదాహరణలివీ..

- జిల్లా గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో కీలక పోస్టులో పనిచేస్తున్న ఒక ఉద్యోగి దీర్ఘకాలిక వ్యాధి బారినపడ్డారు. ఆయన రెండేళ్ల కిందట పదవీ విరమణ చేశారు. ఈ ఉద్యోగి తన వైద్యఖర్చుల కోసం రూ.25 లక్షల వరకు ఖర్చు చేశారు. తన ఆరోగ్యం రోజురోజుకు క్షీణించిపోతోందని, తనకు రావాల్సిన పీఎఫ్ ఇప్పించాలని, తానేమీ ఇచ్చుకునే స్థితిలో లేనని కార్యాలయం చుట్టూ తిరిగినా సదరు అవినీతి ఉద్యోగి పట్టించుకోలేదు. జిల్లాస్థాయి అధికారులు చెప్పినా ఫైలును తనవద్దే పెట్టుకున్నాడు. రెండేళ్లుగా ఇలా తొక్కిపెట్టాడని ఆ శాఖ ఉద్యోగులు బాహాటంగానే విమర్శిస్తున్నారు.
- గతంలో జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీగా పనిచేసిన ఒక అధికారి వేరే జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఇటీవల ఆయన పదవీ విరమణ చేశారు. ఈ అధికారికి పీఎఫ్‌కు సంబంధించిన ఫైలును సిద్ధం చేసేందుకు ఆయన్ను జిల్లా కార్యాలయానికి రప్పించిన ఈ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి.. తన చేయి తడిపాకే ఫైలును సిద్ధం చేసి పంపాడని కార్యాలయ ఉద్యోగులు చెబుతున్నారు.
- జిల్లాలో వివిధ మండలాల్లో పనిచేస్తున్న 15 మంది ఏఈలు, ఇతర సిబ్బంది గడిచిన రెండేళ్లలో పదవీ విరమణ చేశారు. తనను ప్రసన్నం చేసుకోకపోవడంతో వారు పదవీ విరమణ చేసిన నెలలను తప్పుగా నమోదు చేశాడు. వీరంతా గుంటూరు పీఎఫ్ కార్యాలయం, మచిలీపట్నంలోని గృహ నిర్మాణశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

ఎలక్ట్రికల్ బస్సులు వేగంగా..



కేంద్రానికి ఆర్టీసీ ప్రతిపాదనలు

విజయవాడకు 100, అమరావతికి 50 అవసరం

- సమగ్ర వివరాలతో అధికారుల నివేదిక
- కేంద్ర ప్రోత్సాహక పథకంలో భాగమే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : త్వరలో నగరంలో అత్యాధునిక ఎలక్ట్రికల్ బస్సులు సందడి చేయనున్నాయి. విద్యుత్ బస్సులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన ప్రోత్సాహక పథకంలో భాగంగా విజయవాడలో 100, అమరావతిలో 50 విద్యుత్ బస్సులకు ఆర్టీసీ ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలు దాదాపు కార్యరూపం దాల్చే పరిస్థితి కనిపిస్తోంది. నగరంలో 15, అమరావతిలో 7 డిమాండ్ ఉన్న రూట్లలో రోజూ సగటున ఎంతమంది ప్రయాణిస్తున్నారు? విద్యుత్ బస్సులు ఎన్ని కిలోమీటర్లు తిరుగుతాయి? వీటిద్వారా ఎంత ఆదాయాన్ని పొందవచ్చు? వంటి వివరాలను ఆర్టీసీ అధికారులు కేంద్రానికి పంపారు. నగరంలో 12 మీటర్ల పొడవున్న ఎలక్ట్రికల్ బస్సులకు, అమరావతిలో 9 మీటర్లు, 12 మీటర్ల బస్సులకు ప్రతిపాదించారు. విజయవాడ సిటీ సబర్బన్ పరిధిలో తిరిగే విద్యుత్ బస్సులను విద్యాధరపురం డిపో నుంచి, అమరావతిలో తిరిగే బస్సులను మంగళగిరి డిపో నుంచి నిర్వహిస్తామని తెలిపారు.


కాలంచెల్లిన బస్సులకు ఇక చెల్లు

నగరంలో కాలంతీరిన, డొక్కు బస్సులు ఎక్కువగా ఉన్నాయి. మొత్తం 400 సిటీ బస్సుల ఆపరేషన్ సంఖ్య 300కు పడిపోయింది. వీటిలో కూడా 200కుపైగా తుక్కు బస్సులే. వీటివల్ల ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఫలితంగా ప్రయాణికులు ఆర్టీసీకి దూరమవుతున్నారు. ఆటోల్లో ఎక్కువగా ప్రయాణిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నగరవాసులకు సౌకర్యవంతమైన, కాలుష్యరహితమైన, శబ్దరహితమైన విద్యుత్ బస్సులు అందుబాటులోకి తేవాలన్నది ఆర్టీసీ ఉన్నతాధికారుల వాదన. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాల వల్ల విద్యుత్ బస్సుల ఖర్చు కూడా తగ్గుతుంది. ప్రస్తుతం ప్రతిపాదనలు పరిశీలన దశలో ఉన్నాయి. త్వరలోనే కేంద్రం నుంచి శుభవార్త వచ్చే అవకాశం ఉంది.

కాలు జారితే కాల్వలోకే..!

- వేల్పూరులో వంతెన కూలి నెల రోజులు
- ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి
- రాకపోకలకు స్థానికుల అవస్థలు
- కన్నెత్తి చూడని పాలకులు, అధికారులు

6





కమిషనర్ భవానీప్రసాద్

క్లాప్ వాహన డ్రైవర్ల ఆందోళనతో తాడిగడప మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పి ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే.. పరిష్కరించాల్సిన మున్సిపల్ కమిషనర్ అర్థంలేని వ్యాఖ్యలు, నిర్ణయాలతో వివాదాస్పదంగా మారుతున్నారు. రాజకీయ నాయకులపై పైచేయి చూపించుకోవడంలో నిమగ్నమై అసలు సమస్యలను గాలికొదిలేస్తున్నారు.

ఎమ్మెల్యే చెబితే వినాలా..!

వివాదాస్పదంగా తాడిగడప మున్సిపల్ కమిషనర్

- ఉద్యోగులు, సిబ్బందిపై దురుసు ప్రవర్తన
- బదిలీపై వచ్చిన ఉద్యోగులకు బాధ్యతలు ఇవ్వరు
- ఎమ్మెల్యే చెప్పారన్న సాకుతో కావాలనే జాప్యం
- పారిశుధ్య సమస్య పక్కనపెట్టి వివాదాలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ/పెనమలూరు) : తాడిగడప మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన భవానీ ప్రసాద్ వ్యవహారశైలిపై కార్యాలయ సిబ్బందితో పాటు అధికార పార్టీ నాయకులు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లేందుకు తరచూ కార్యాలయానికి వెళ్తున్న కూటమి పార్టీ నాయకులతో 'మీకు పనీపాటా లేదా.. ఎప్పుడూ మా కార్యాలయం చుట్టూ తిరుగుతుంటారు.' అని ఆయన వ్యాఖ్యానిస్తుండటంతో నాయకులంతా కంగుతింటున్నారు.

వివాదాస్పద నిర్ణయాలు

సిబ్బంది విషయంలోనూ కమిషనర్ తీరు వివాదాస్పదంగా ఉంటోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి టీపీఎస్‌లుగా శ్రీనివాసరావు, అరుణ తాడిగడప మున్సిపాలిటీకి వచ్చారు. ఏసీపీగా సీఆర్డీయే కార్యాలయంలో

మిగతా 6లో..

ఎస్ఎన్ గొల్లపాలెం గ్రామంలో నాట్లు వేస్తున్న వ్యవసాయ కార్మికులు



ఆత్మవిశ్వాసంతో మళ్లీ సాగు

4,500 ఎకరాల్లో రెండోసారి వరినాట్లు

- బందరు, అవనిగడ్డల్లో పనులు ముమ్మరం
- కష్టాలెన్నైనా తగ్గేదేలే అంటున్న అన్నదాతలు

ప్రకృతి పగబట్టింది.. ఆకాశం కన్నెర్రజేసింది.. తుఫాను బీభత్సం సృష్టించింది.. భారీ వర్షాలు రైతులను నిండా ముంచేశాయి.. అయినా చెరగని ఆత్మవిశ్వాసంతో ముందుకు కదిలాడు రైతన్న. ముంపునకు గురైన పంటలను చూసి కుంగిపోక.. తలపాగా చుట్టి.. తువ్వాలు బిగించి.. దమ్ము చేసి.. దుక్కి దున్ని.. మళ్లీ నాట్లు వేయాలనుకున్నాడు. ప్రభుత్వం నుంచి అందిన పరిహారంతో రెండోసారి వరినాట్లకు శ్రీకారం చుట్టాడు. ప్రస్తుతం బందరు, ఘంటసాల, గూడూరు, కృత్తివెన్ను మండలాల్లో వరినాట్లు వేగంగా వేస్తున్నారు.

8లో

భూ సమస్యలు పరిష్కరించండి

6

- నీటితీరువా వసూలు వేగవంతం చేయండి
- జిల్లాలో 302 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- 9.80 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ

53 రైళ్ల రద్దు

- 'దానా' తుఫాన్‌తో రైల్వేశాఖ హై అలర్ట్
- బెజవాడ మీదుగా పాసింగ్ అయ్యే రైళ్ల రద్దు
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

8లో



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు కేశినేని శివనాథ్, సీఎం రమేష్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ్‌కుమార్‌లకు దుర్గమ్మ చిత్రపటాలు అందజేస్తున్న ఈవో

దుర్గమ్మ సేవలో కూటమి ప్రజా ప్రతినిధులు

వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను బుధవారం కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌లు ఒకేసారి దర్శించుకున్నారు. వీరికి ఈవో రామారావు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగత సత్కారాలు అందజేశారు. దుర్గమ్మ దర్శనం అనంతరం నేతలకు శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం, ఆశీర్వచనాలు అందజేశారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, వైదిక కమిటీ సభ్యులు శివప్రసాద్ శర్మ, శ్రీనివాస శాస్త్రిలు పాల్గొన్నారు.

దుర్గమ్మ అనుగ్రహం, సీఎం కృషి వల్లే గిన్నిస్ రికార్డులు

అమ్మవారి దర్శనానంతరం ఎంపీ శివనాథ్ విలేకరులతో మాట్లాడుతూ, కనకదుర్గమ్మ ఆశీస్సులు, సీఎం చంద్రబాబు కృషి వల్లే డ్రోన్ హాకథాన్‌కు ఐదు గిన్నిస్ రికార్డులు లభించాయని పేర్కొన్నారు. చంద్రబాబు సంకల్పం, దుర్గమ్మ అనుగ్రహం వల్లనే దేశంలో మొదటిసారి ఇంతపెద్ద స్థాయిలో డ్రోన్ సమ్మిట్ అమరావతి రాజధానిలో ఏర్పాటు చేయటం విశేషమని కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించేలా కరుణాకటాక్షాలు ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నట్టు నేతలు తెలిపారు.





అన్నవితరణకు, ఆలయ స్వర్ణ తాపడానికి దాతల విరాళం

ఏలూరుజిల్లా, కైకలూరులోని ఎన్టీవోస్ వీధికి చెందిన ఇందుకూరి సత్యనారాయణరాజు కుటుంబసభ్యులతో కలిసి బుధవారం అన్నవితరణ నిమిత్తం ఆలయ అధికారులకు రూ.1,00,116లను చెక్కు రూపంలో అందజేశారు. కృష్ణాజిల్లా, గుడివాడకు చెందిన బోను నాగమణి కుటుంబసభ్యులతో కలిసి బుధవారం అన్నవితరణ నిమిత్తం ఎం.వెంకటేశ్వరరావు, సరోజినీదేవి పేరున రూ.1,00,116ల చెక్కు అందజేశారు. ఆలయ స్వర్ణ తాపడం నిమిత్తం రూ.1,00,116లు చెక్కు అందజేశారు.



వర్సిటీలో వివిధ అంశాలను తిలకిస్తున్న నాక్ బృందం

కృష్ణా వర్సిటీ సందర్శనలో నాక్ బృందం

» విశ్వవిద్యాలయ ప్రగతిని నివేదించిన అధ్యాపకులు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కృష్ణావిశ్వవిద్యాలయాన్ని బుధవారం నాక్ బృందం సందర్శించింది. వివిధ విభాగాల ప్రతినిధులు విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న విద్యావిషయిక కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెటేషన్ ద్వారా వివరించారు. నాక్ బృందం చైర్మన్, మైసూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఎన్‌కె లోకనాథ్ అధ్యక్షతన వచ్చిన ప్రతినిధులకు కేయూ ఉపకులపతి ఆర్.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ కె.శోభన్‌బాబు, డీన్‌లు బసవేశ్వరరావు, సుందరకృష్ణలు ఘనస్వాగతం పలికారు. నాక్ చైర్మన్ ఎన్‌కె లోకనాథ్, సభ్యులు హర్యానా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రీచా మదన్, పంజాబ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సంజీవ్‌కుమార్‌శర్మ, బరోడా ఎఎస్‌విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ప్రదీప్ దీటా, బనారస్ విశ్వవిద్యాలయంప్రొఫెసర్ ప్రకాష్ చంద్ర అసోం విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సుపాటిండే, మహారాష్ట్ర సెయింట్ జార్జి బాబా విశ్వవిద్యాలయం డీన్ హేమత్ దీక్షముఖ్‌లు నాక్ బృందంలో ఉన్నారు. ముందుగా ఉపకులపతి శ్రీనివాసరావు విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను సంక్షిప్తంగా వివరించారు. అనంతరం క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ నవీన లావణ్యలత తదితరులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. మూడురోజుల పాటు జరిగే పరిశీలన కార్యక్రమంలో వివిధ కళాశాలల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించి నివేదికలను తయారు చేయనున్నారు.



బాలలతను సన్మానిస్తున్న కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్, ప్రిన్సిపాల్స్

ఉన్నత ఆశయాలతో లక్ష్యాలు సాధించాలి

» రక్షణ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్ బాలలత

చల్లపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నతమైన ఆశయాలు, ఆలోచనలతో అత్యున్నత స్థానాలకు ఎదగాలని రక్షణశాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఎం.బాలలత పేర్కొన్నారు. చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో శ్రీవివేకానంద డిగ్రీ కళాశాల, విజయ జూనియర్ కళాశాలల డైరెక్టర్ యార్లగడ్డ శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ఉజ్వల భవిష్యత్ - లక్ష్యాల సాధన' అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న బాలలత మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ సాహసంతో పోరాడి లక్ష్యం సాధించాలన్నారు. బాల్యంలో టీకా వికటించి రెండు కాళ్లు కోల్పోయినప్పటికీ తాను ఉన్నతస్థాయికి ఎదిగిన తీరు వివరించి స్ఫూర్తి కలిగించారు. మొబైల్ ఫోన్‌ను విద్యా అనుబంధ అంశాలు తెలుసుకునేందుకు వినియోగించుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్, బాలలతను ఘనంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

మచిలీపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ పరీక్షరాసే ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు ప్రభుత్వం ద్వారా ఉచితంగా శిక్షణ తీసుకునేందుకు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ జేడీ షాబుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22తోనే ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు ముగిసినా, మరో మూడు రోజులపాటు ప్రభుత్వం గడువు పెంచిందని ఆయన తెలిపారు. జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఈ దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో జేడీ సూచించారు.

26న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉపాధి కల్పన శాఖ, ఏపీఎస్ఎస్‌డీసీ, డీఆర్‌డీఏ, సిడాప్‌లు సంయుక్తంగా ఈనెల 26న పోతేపల్లి ఇమిటేషన్ జ్యూయలరీ పార్కులో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఒకేషన్ ఉపాధి కల్పనాధికారి సత్యబ్రహ్మం తెలిపారు. శనివారం పోతేపల్లి జ్యూయలరీ పార్కులో జరిగే జాబ్‌మేళాకు ఆసక్తిగల అభ్యర్థులు రిజిష్టర్ చేసుకోవచ్చన్నారు.

కాలు జారితే కాల్వలోకే..!

» వేల్పూరులో వంతెన కూలి నెల రోజులు
» ద్విచక్రవాహనాలు సైతం వెళ్ల లేని పరిస్థితి
» మూడొంతులకు పైగా కూలిన అప్రోచ్ రోడ్డు, వంతెన పిల్లరు
» రాకపోకలకు స్థానికుల అవస్థలు
» కన్నెత్తి చూడని పాలకులు, అధికారులు

(వేల్పూరు/పమిడిముక్కల, ఆంధ్రజ్యోతి)

వైల్పూరు నుంచి కనుమూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఉన్న మురుగుకాల్వపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన అప్రోచ్‌రోడ్డు కోతకు గురై పిల్లరు చుట్టూ మట్టికొట్టుకుపోయింది. ఇటీవల వచ్చిన వరదలు, భారీ వర్షాలకు అప్రోచ్ రోడ్డు, పిల్లరు కూలి కాల్వలో పడిపోయాయి. దీంతో రెండు గ్రామాలకు మధ్య రాకపోకలు నిలచిపో యాయి. మిగిలిన అప్రోచ్, పిల్లరు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితుల్లో వంతెన పైనుంచి వెళ్లాలంటే స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కాల్వ పక్కన ఉన్న పొలాల్లో వ్యవసాయపనులకు వెళ్లేందుకు రైతులు, కూలీలు, కనుమూరు వైపు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు మిగిలి ఉన్న వంతెన పైనుంచి వెళ్లలేక ముళ్లపూడి, హనుమంతపురం, కపిలేశ్వరపురం మంటాడవైపు చుట్టూ తిరిగి వెళ్లవలసిరావడంతో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. హనుమంతపురం, ముళ్లపూడి, వేల్పూరు గ్రామాల నుంచి కనుమూరు వైపు వెళ్లేందుకు ఇది దగ్గర కాగా వంతెన కూలిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు దూరాభారమైంది. ప్రత్యామ్నాయంగా కాల్వలో తూములు వేసి వంతెన పక్కన డైవర్షన్ రోడ్డు నిర్మిస్తే తాత్కాలికంగానైనా ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

అది బ్రిటీషు కాలం నాటి వంతెన.. సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోక కూలి ప్రమాదకర స్థితికి చేరింది.. చుట్టూ వ్యవసాయ పొలాలు ఉండటంతో అటువైపు రైతులు, పాఠశాలల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల వరదలకు అప్రోచ్ రోడ్డు, పిల్లర్ కూలిపోయాయి. వంతెనపై వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకువస్తుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళుతున్నారు. వేల్పూరు-కనుమూరు రోడ్డులో మురుగు కాల్వ (ఐనంపూడి డ్రెయిన్)పై వంతెన దుస్థితిపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



వేల్పూరు-కనుమూరు రోడ్డులో మురుగుకాల్వపై కూలిన వంతెన

డైవర్షన్ రోడ్డు వేస్తామంటున్నారు

- రత్నం దిలీప్ కుమార్, వేల్పూరు సర్పంచ్



వంతెన కూలి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వంతెన వద్ద అప్రోచ్‌రోడ్డు కోతకు గురై భారీవర్షాలకు పిల్లరుకూడా కొట్టుకుపోయింది. కనుమూరు వైపు వెళ్లేందుకు దారిలేక చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తున్నది. ప్రజల అవస్థలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా అధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయం ఏర్పాటుచేయాలని సూచించారు. డైవర్షన్ రోడ్డు వేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు అంటున్నారు.

పొలాలకు వెళ్లలేకపోతున్నాం..

- రాజులపాటి దుర్గారావు, రైతు



కాల్వ అవతల ఉన్న పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ఎరువులు వేయాలంటే వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. ట్రాక్టర్లు చుట్టూ తిప్పుకుని వచ్చి వంతెన ఆవల ఉంచవలసి వస్తున్నది. పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకోవాలి.

చుట్టు తిరిగి వెళ్లాలి..

- పాలపర్తి సుధాంజనేయులు, గ్రామస్థుడు



వంతెన కూలి నెలలు గడుస్తోంది. కనుమూరు వైపు వాహనాలు వెళ్లే వీలు లేక చుట్టుతిరిగి వెళుతున్నాం. అధికారులు ప్రత్యామ్నాయం చూపాలి. కూలిన వంతెనపై కాలినడకన వెళ్లాలన్నా భయపడుతున్నాం.

డైవర్షన్ రోడ్డు వేస్తున్నాం..

- బలరాం, డీఈ, ఆర్‌అండ్‌బీ ఉయ్యూరు

కూలిన వంతెన పక్కన డైవర్షన్ రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్‌ను పిలిచాం. త్వరలో రోడ్డువేసి ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటాం. కొత్తవంతెన నిర్మాణానికి అంచనాలు తయారుచేసి నిధులు మంజూరైన అనంతరం వంతెన నిర్మాణం చేస్తాం.

పటిష్టమైన భద్రతా చర్యలు

» నూతన ఏఆర్ ఏఎస్పీ సత్యనారాయణ



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపడతామని బుధవారం ఏఆర్ ఏఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ అన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణాజిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. గన్నవరం విమానాశ్రయంలో వీఐపీలకు, మంత్రులకు సెక్యూరిటీ వంటి కీలకమైన బాధ్యతలు ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు చేస్తున్నారన్నారు. గతంలో కృష్ణాజిల్లాలో ఏఆర్ డీఎస్పీగా పనిచేశానన్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరావును సత్యనారాయణ కలిశారు.



ఎంపికైన క్రీడాకారులతో టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఫిజికల్ డైరెక్టర్లు

సౌత్‌జోన్ బ్యాడ్మింటన్‌కు

కృష్ణావర్సిటీ జట్టు ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : చెన్నైలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈనెల 26 నుంచి 29 వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొనే కృష్ణాయూనివర్శిటీ పురుషుల జట్టును ఎంపిక చేసినట్టు టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీవీబీ కృష్ణారెడ్డి, చైర్మన్, ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌లు తెలిపారు.వీబీ సిద్ధార్థ కళాశాలలో జరిగిన అంతర్ కళాశాలల టోర్నీలో సత్తాచాటిన వారితో జట్టును ఎంపిక చేసినట్టు తెలిపారు. ప్రవీణ్‌కుమార్, వై.నాగకళ్యాణ్, ఎస్.పోతురాజు, ఐ.ఈశ్వర్‌సాయి(సిద్ధార్థ డిగ్రీ కళాశాల), సాయికృష్ణ(ఎస్‌వీడీ సిద్ధార్థ లా కళాశాల), బి చిద్విరామ్(పవిత్ర డిగ్రీ కళాశాల), కె.విజయ విహారీ(వికాస్ కళాశాల)లు ఎంపికయ్యారు. ఎంపికలు వాసిరెడ్డి నాగేశ్వరరావు, రఘురామ్‌ల ఆధ్వర్యంలో చేపట్టినట్టు తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించండి

» నీటితీరువా వసూలు వేగవంతం చేయాలి
» జిల్లాలో 302 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
» 9.80లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
» కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, పక్కన జేసీ, డీఆర్వో

మచిలీపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారులు, పారదర్శకంగా వ్యవహరించి ప్రజల మన్ననలు పొందాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లో జేసీ గీతాంజలిశర్మతో కలిసి రెవెన్యూ అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూములకు సంబంధించిన సబ్‌డివిజన్, మ్యుటేషన్స్ తదితర అంశాలపై తహసీల్దార్లు దృష్టి సారించాలన్నారు. 'మీకోసం' అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. నీటితీరువా వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. తహసీల్దార్లు గ్రామాలవారీగా గ్రీవెన్స్ ప్రొఫైల్ తయారు చేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూసదస్సులు నిర్వహించే తేదీలను ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుందని, దీనికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో అనధికార లేఅవుట్‌లను గుర్తించాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా నిఘా ఉంచాలన్నారు. ఇసుకరీచ్‌లో జేసీబీలు, యంత్రాలతో తవ్వకాలు జరగకుండా చూడాలని, అనధికార ఇసుకస్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ఓటర్ల జాబితాల సవరణపై దృష్టి పెట్టండి

ఫొటో ఓటర్ల జాబితాల సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని షెడ్యూలు ప్రకారం నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అంగన్వాడీ కార్యకర్తలు బీఎల్‌వోలుగా ఉంటే, వారిని తొలగించి, సచివాలయ సిబ్బందిని వారిస్థానంలో నియమించాలన్నారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు పూర్తి చేయలన్నారు. కోర్టు కేసులకు సంబంధించిన అంశంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిశ్రమల స్థాపనకోసం కేటాయించిన భూములను పరిశీలించాలని, అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయకపోతే సంబంధిత భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. జాతీయరహదారుల అభివృద్ధికి సంబంధించి భూసేకణ పలుచోట్ల పెండింగ్‌లో ఉందని ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు.

9.80 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి : జేసీ

జిల్లాలో ఈ ఖరీఫ్‌సీజన్‌లో 9.80లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉందని, 302 కేంద్రాల ద్వారా జిల్లాలో ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు జేసీ గీతాంజలి శర్మ తెలిపారు. అధికారులు తగిన ప్రణాళికను తయారు చేయాలన్నారు. రైతు సేవాకేంద్రాలు, మిల్లులవద్ద ధాన్యంలో తేమశాతం కొలుస్తారని ఆమె అన్నారు. రైతులు తమకు నచ్చిన మిల్లుల వద్ద ధాన్యం విక్రయించుకోవచ్చని, ఈ అంశంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గన్నీబ్యాగుల కొరత లేకుండా చూడాలని, రైతుసేవాకేంద్రాల వద్ద టెక్నికల్ అసిస్టెంట్లను నియమించుకోవాలన్నారు. సచివాలయ సిబ్బందిని ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఉపయోగించుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖర రావు, మచిలీపట్నం, ఉయ్యూరు, గుడివాడ ఆర్డీవోలు కె.స్వాతి, జి.బాలసుబ్రహ్మణ్యం, బీఎస్ హేలాషారోన్, డీఎస్‌వో పార్వతి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సృజన, సర్వే విభాగం ఏడీ జోషిలా, ఆయా మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

అందరి అభిప్రాయంతోనే అవనిగడ్డ ఇన్‌చార్జి నియామకం

» ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

అవనిగడ్డ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అందరి అభిప్రాయంతోనే ఆమోదయోగ్యుడైన, సమర్థుడైన వ్యక్తిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమిస్తామని జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ స్పష్టం చేశారు. బుధవారం అవనిగడ్డలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో కొనకళ్ల మాట్లాడుతూ, పార్టీని అధికారంలోకి తీసుకురావటంలో కార్యకర్తల సేవలు ఎనలేనివన్నారు. నియోజకవర్గాన్ని పొత్తులో భాగంగా జనసేన పార్టీకి కేటాయించటంతో కార్యకర్తలు తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలని ఆందోళన చెందుతున్నారని, తాను ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్నప్పటికీ కార్యకర్తలకు అండగా ఉంటానని, వెంటనే స్పందిస్తానని తెలిపారు. నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇప్పటికీ కొంతమంది అధికారుల వైఖరిలో మార్పు రాలేదని, అలాంటి వారిని ఊపేక్షించేది లేదన్నారు. టీడీపీకి కంచుకోటలాంటి నియోజకవర్గంలో ఈసారి కూడా సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానంలో నిలపాలని కనపర్తి సూచించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు తాము క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, చల్లపల్లి ఎంపీపీ కోట విజయరాధిక, రావి దుర్గావాణి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు తుమ్మల చౌదరిబాబు, మండవ బాలవర్ధిరావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చెబితే వినాలా..!

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్న రంగప్రసాద్ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడి నుంచి టౌన్‌ప్లానింగ్‌లో పనిచేస్తున్న గిరి, మురళీగౌడ్ మరోచోటకు వెళ్లారు. సెప్టెంబరు 24న మున్సిపాలిటీలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన టీపీఎస్ శ్రీనివాసరావుకు బాధ్యతలు అప్పగించడంలో కమిషనర్ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు తెలియడంతో ఆయన కమిషనర్‌కు ఫోన్‌చేసి శ్రీనివాసరావుకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. దీన్ని మనసులో పెట్టుకున్న కమిషనర్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఒక సమీక్ష సమావేశంలో శ్రీనివాసరావును ఉద్దేశించి వేలెత్తి చూపుతూ. 'ఎమ్మెల్యే చెబితే నేను వినాలా.. నీకు బాధ్యతలు అప్పగించేయాలా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన తర్వాత పోరంకి ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న గుమాస్తాకు ఆర్‌ఐ పోస్టు ఇవ్వాలని ఎమ్మెల్యే కమిషనర్‌కు సూచించగా, ఇప్పటికిప్పుడు కుదరదని, ఓ రెండు నెలలు ఆగితే చూస్తానని ఎమ్మెల్యేకు నిర్లక్ష్యంగా చెప్పారు.

పారిశుధ్య సమస్యలు వదిలేసి..

ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించే క్లాప్ వాహన డ్రైవర్ల జీతాల చెల్లింపుల విషయంలో ఏర్పడిన ప్రతిష్టంభనతో వారంతా ఆందోళనకు దిగారు. దీంతో తాడిగడప మున్సిపాలిటీలో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయాయి. గతంలో పనిచేసిన కమిషనర్ జీతాల చెల్లింపులో జాప్యాన్ని నివారించడానికి మున్సిపల్ ఫండ్ నుంచి కొద్ది మొత్తంలో డ్రైవర్లకు చెల్లింపులు జరిపి పనిచేయించుకునేవారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సమస్య తీవ్రం కాకుండా చూసుకునేవారు. ప్రస్తుత కమిషనర్ మాత్రం.. క్లాప్ వాహన డ్రైవర్ల జీతాల సమస్య తనకు సంబంధం లేదని బహిరంగంగానే చెబుతున్నారు. సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల విషయంలోనూ చొరవ చూపడం లేదు. డ్రెయినేజీ రోజువారీ పూడిక తొలగింపు ప్రక్రియ కూడా నిలిచిపోయింది. దీంతో వర్షాలకు ఎక్కడికక్కడ డ్రెయిన్లు పొంగుతున్నాయి. గతంలో భవానీప్రసాద్ పనిచేసిన పొన్నూరు, మదనపల్లి, హిందూపురం, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీల్లోనూ సిబ్బంది, స్థానిక నాయకులతో సమన్వయలోపం తలెత్తిందని, వివాదాల కారణంగా స్వల్పకాలంలోనే బదిలీ అయ్యారని తెలుస్తోంది.

రఘు బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకో

» ఉదయభానుపై ఆరోపణలు తగదు
» జనసేన నేత తుమ్మల ప్రభాకర్



జగ్గయ్యపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభానుపై టీడీపీ నేత నోముల రఘు చేసిన ఆరోపణలు, విమర్శలు పూర్తి నిరాధారమైనవని జనసేన నేత, వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తదితరులు ఖండించారు. నోముల రఘు వ్యక్తిగత స్వలాభం కోసం తప్పుడు ఫిర్యాదులతో బ్లాక్‌మెయిలింగ్ చేస్తున్నాడని, అన్నారు. నియోజకవర్గంలో ఇసుక అక్రమరవాణాపై ఉదయభాను జిల్లా సీపీకి ఫిర్యాదు చేశారని, అప్పటి నుంచి రఘు సోషల్ మీడియాలో ఉదయభానుకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నాడని, ఆయన జనసేన పార్టీలో చేరకుండా అడ్డుకునేందుకు ఈ కథంతా నడిపిస్తున్నారని ఆరోపించారు. పట్టణ జనసేన నేతలు ఆకుల బాజి, షేక్ సత్తార్, కాశీ కిశోర్, కాటగాని నరసింహారావు, షేక్ ఖాదర్ తదితరులు మాట్లాడారు. నోముల రఘుకు బీజేపీతో సంబంధం లేదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గోలి రాఘవ చెప్పారు. 2021లోనే ఆయన బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశాడన్నారు. రాజీనామా చేసిన పత్రాలను మీడియాకు విడుదల చేశారు. నోముల రఘుపై హత్యాయత్నం కేసులో చట్టం తనపని తాను చేసుకుపోతుందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. జగ్గయ్యపేటలో విలేకరుల ప్రశ్నకు సమాధానమిస్తూ.. సమగ్ర విచారణ జరిపి నిందితులను పట్టుకోవాలని, వారి వెనుక ఎవరున్నారనేది నిగ్గుతేల్చాలని పోలీసులను కోరుతున్నామని చెప్పారు.

ప్రభుత్వం మారినా ఇబ్బందులు తప్పవా!

» టీడీపీ ద్వితీయశ్రేణి నేతల ఆవేదన

తిరువూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో నేతలు తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని.. కూటమి ప్రభుత్వం వచ్చినా ఇబ్బందులు తప్పటం లేదని టీడీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో వెలుగు, ఉపాధి హామీ పథకాల్లో సిబ్బంది మార్పునకు సంబంధించి కొందరు టీడీపీ క్యాడరును కాదని వైసీపీలో అంటకాగిన వారికి, చంద్రబాబునాయుడుపై సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు, తప్పుడు ఫోటోలు పెట్టిన వారికి పోస్టింగులు ఇచ్చేందుకు కొందరు నాయకులు ఉత్సాహం చూపిస్తున్నారని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. 2014 నుంచి 2019 వరకు వెలుగు, ఉపాధి పథకంలో బుక్‌కీపర్లు, ఎఫ్‌ఏలు, ఇతర విభాగాల్లో పనిచేశామని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమను తొలగించి, వైసీపీ చెందిన వారిని నియమించి తమపట్ల కక్షసాధింపుగా వ్యవహరించినట్టు పలువురు కార్యకర్తలు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఆయా గ్రామాల్లో టీడీపీ గ్రామ కమిటీలు ఉపాధి, వెలుగు పథకాల్లో పార్టీకి చెందిన వారికి అవకాశం కల్పించాలని గ్రామపార్టీలు తీర్మానం చేసినా ఆచరణకు నోచుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. టీడీపీ గ్రామస్థాయి కార్యకర్తల్ని విస్మరిస్తూ వైసీపీకి చెందిన వారికి అవకాశాలు కల్పిస్తున్న నేతలపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు సిద్ధం అవుతున్నారు. త్వరలో పార్టీ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యలు చెప్పుకుంటామని, అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని, ద్వితీయశ్రేణి నేతలు చెపుతున్నారు.

వసూల్ రాజా..

(5వ పేజీ తరువాయి)

ఈపీఎఫ్ కార్యాలయానికి పంపాలి. ఈ ఉద్యోగి ఆ ఫైళ్లను పంపకుండా తన వద్దే ఉంచుకుంటున్నాడు. పదవీ విరమణ చేసిన అధికారులు, ఉద్యోగులు అతని వద్దకు వస్తే.. తెరవెనుక డబ్బు డిమాండ్ చేయడం మొదలుపెట్టాడు. ఇంతమొత్తంలో నగదు ఇస్తే ఫైలును సిద్ధం చేస్తానని చెప్పేవాడు. నగదు ఇవ్వని అధికారులు, సిబ్బందికి సంబంధించిన ఫైళ్లను తప్పులతడకగా పంపేవాడు. దీంతో లెక్కలు సక్రమంగా లేని ఫైళ్లు గుంటూరు కార్యాలయం నుంచి వెనక్కి వచ్చేసేవి. ముడుపులు ఇవ్వని ఉద్యోగులు ఉద్యోగంలో చేరిన తేదీ లేదా పదవీ విరమణ తేదీలను రెండు నెలలపాటు తప్పుగా చూపడం వెనుక ఈ ఉద్యోగి అవినీతి ఉంది. దీంతో ఫైళ్లను సరిచేసుకుని తీసుకురమ్మని చెప్పి గుంటూరు కార్యాలయం అధికారులు వెనక్కి పంపేస్తున్నారు నగదు ఇచ్చిన వారి ఫైళ్లను మాత్రం ఈ ఉద్యోగి పక్కాగా తయారుచేసి పంపడం గమనార్హం.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

సదరు ఉద్యోగి అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నాడు. పదవీవిరమణ చేసిన ఉద్యోగులను ఈ ఉద్యోగి ఇబ్బందులపాలు చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. అయినా ఈ అంశంపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం. **- ఎస్.వెంకట్రావ్, జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ**

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	131,140, 151
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి



హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవడంతో పాటు రాష్ట్రాభివృద్ధి కోసం ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి తెలిపారు. బొమ్ములూరులో బుధవారం ఇంటింటికీ వెళ్లి పట్టభద్రుల ఓటు ఫారం అందజేశారు. నవంబరు 2021 నాటికి పట్టభద్రులందరూ అర్హులన్నారు.



కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారితో పరుచూరి రామకృష్ణ, మురళి

కేవీఐఎస్ఎస్ ఆధ్వర్యంలో 23 మందికి కంటి ఆపరేషన్లు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రంగయ్యప్పారావుపేటలో నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో శస్త్ర చికిత్స అవసరమైన 23మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు బుధవారం నిర్వహించారు. గ్రామం నుంచి కమ్మవారి ఐక్య సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో తీసుకువెళ్లి శంకర నేత్ర వైద్యశాలలో శస్త్రచికిత్సలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లను అందజేసినట్లు అధ్యక్షుడు వివరించారు. ఈ కార్యక్రమంలో శంకర గ్రూప్ పీఆర్‌ఓ మురళి, కార్యదర్శి పొట్లూరి ఫణీంద్ర, సభ్యుడు పరుచూరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మానవతకు డాక్టర్ దుట్టా రూ.లక్ష విరాళం

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మానవత సంస్థ హనుమాన్ జంక్షన్ శాఖ నిర్వహిస్తున్న శాంతిరథం నిర్వహణకు సీనియర్ వైసీపీ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు రూ.లక్ష విరాళం అందించారు. ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పనవీడు శ్మశాన వాటిక వద్ద ఆ విరాళాన్ని వినియోగించి వాహనాన్ని భద్రపరచడానికి రామచంద్రరావు సతీమణి దుట్టా సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం షెడ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు : ఏవో

గన్నవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ఖరీఫ్ వరి ధాన్యాన్ని ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందని ఏవో ఎన్ఎల్ తేజస్వి అన్నారు. మండలంలోని అల్లాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ డొక్కు సాంబశివ వెంకన్నబాబు, చిక్కవరపు నాగమణి, ఆళ్ల పట్టాభి, పలువురు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



దుస్తులు, వంటపాత్రలు అందజేస్తున్న సుధారాణి, సూర్యకుమారి, విష్ణుప్రియ

పేదలకు దుస్తులు అందజేత

ఉయ్యూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవా కార్యక్రమాల్లో ఇన్నర్‌వీల్ క్లబ్ ముందంజలో ఉంటుందని క్లబ్ అధ్యక్షురాలు నర్రా సుధారాణి అన్నారు. గురజాడ డొంకలో చెరువుకట్టపై నివాసముంటున్న గిరిజన కుటుంబాలకు ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం దుస్తులు, వంటపాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఊరికి దూరంగా చెరువుకట్టపై గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వారికి తోచిన విధంగా సాయం చేయాలన్న ఉద్దేశంతో దుస్తులు, వంటపాత్రలు తినుబండారాలు అందజేశామన్నారు. మాజీ అధ్యక్షురాలు విష్ణుప్రియ,సభ్యురాలు సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

రహదారి అభివృద్ధి చేయాలి

కంకిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అధ్వానంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు అన్నారు. కోమటిగుంట - తెన్నేరు ప్రధాన రహదారి అభివృద్ధి చేయాలని కోరుతూ, బుధవారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ, 2014 - 19లో కోమటిగుంట - తెన్నేరు రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ గ్రామ ప్రజలకు మోక్షం లభించలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తాడంకి నరేష్, సీహెచ్ శ్రీహరి, జె. రవి, బెనర్జీ, సుందరం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు!

- మంటాడ బైపాస్ నుంచి గండిగుంట బైపాస్ వరకు గుంతలమయంగా ఉయ్యూరు ప్రధాన రోడ్డు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, పాదచారులు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)



ఉయ్యూరు ప్రధాన రోడ్డుపై ఫైర్‌స్టేషన్ సమీపాన గుంతల్లో నీరు

ఉయ్యూరు - మంటాడ మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంతో అధ్వాన స్థితికి చేరుకుంది. మంటాడ బైపాస్ నుంచి గండిగుంట బైపాస్ వరకు రోడ్డు పొడవునా పెద్దగుంతలు ఏర్పడి వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనాలు నడిపేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. పామర్రు, పమిడిముక్కల మండలాల నుంచి ఉయ్యూరు వచ్చేవారు ఎక్కువగా ఈ రోడ్డునే ఉపయోగిస్తుంటారు. అదేవిధంగా విజయవాడ వైపు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు ఇదే రోడ్డును ఉపయోగించవలసి ఉంది. మంటాడ బైపాస్ నుంచి గండిగుంట బైపాస్ వరకు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు

ఉయ్యూరు పట్టణ పరిధిలో గండిగుంట నుంచి మంటాడ బైపాస్ వరకు ఆర్ అండ్ బీ రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డులో గుంతలవల్ల ద్విచక్రవాహనాలు సైతం నడపలేని పరిస్థితి. రోడ్డు అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

ప్యాచ్‌వర్కులు చేస్తాం: డీఈ

గండిగుంట నుంచి మంటాడ వరకు రోడ్డుపై గుంతలు పూడ్చడానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆర్ అండ్‌బీ ఉయ్యూరు డీఈ బలరామ్ తెలిపారు.

రోడ్డుపై వెళ్లాలంటే భయం



రోడ్డు పొడవునా గుంతలమయంగా తయారై ప్రమాదకరంగా ఉంది. ద్విచక్ర వాహనాలు నడపాలంటే ఎక్కడ గుంతలో పడతామో అని భయమేస్తుంది. కనీస మరమ్మత్తులైనా చేపట్టి పుణ్యం కట్టుకోండి.

- సీహెచ్ సుబ్బారావు, స్థానికుడు

రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలి



గండిగుంట నుంచి మంటాడ బైపాస్ వరకు రోడ్డులో గుంతలవల్ల ద్విచక్ర వాహనాలు సైతం నడపలేని పరిస్థితి. రోడ్డు అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

- ఖుద్దూస్, ఉయ్యూరు మాజీ చైర్మన్

ప్రజారక్షణకు అత్యధిక ప్రాధాన్యం

- జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్‌రావు
- ఫిర్యాదుదారులను గౌరవిస్తూ, ప్రజాసమస్యలపై తక్షణం స్పందించాలని సిబ్బందికి సూచన
- హైవే మొబైల్, సిబ్బంది పెంపుపై సానుకూలంగా స్పందన



వీరవల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధర్‌రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రక్షణకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ విద్రోహశక్తులు, సైబర్ నేరాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఆర్. గంగాధర్‌రావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వీరవల్లి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం పరిశీలించారు. సిబ్బంది గౌరవవందనం స్వీకరించిన ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటారు. ఆవరణలో శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్సును పరిశీలించారు. ఫిర్యాదుదారులతో గౌరవంగా మెలగుతూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. సమస్యలు సృష్టించేవారిపై, రౌడీలపై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వారంలో రెండు రోజులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలపై ఆరా తీయాలన్నారు. సుమారు మూడు గంటలపాటు రికార్డులను తనిఖీ చేసి ఎలాంటి కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్సై శ్రీనివాస్, ఏఎస్సై ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

● సిబ్బంది పెంపుతో పాటు గన్నవరం విమానాశ్రయం వద్ద ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు గురించి టీడీపీ నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, లంక సురేంద్రమోహనబెనర్జీ, గుండపనేని ఉమా వరప్రసాద్ తదితరులు ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారులతో మాట్లాడి స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీరవల్లి ఉపసర్పంచ్ లంక అజయ్, ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ, మండాది రవీంద్ర ఎస్పీ గంగాధర్‌రావును ఘనంగా సత్కరించారు. నాయకులు వేగిరెడ్డి పాపారావు, చింతల వెంకట శివఅప్పారావు, వేగిరెడ్డి బాలాజీ, మాదాల శ్రీనివాసరావు, మొవ్వా వేణుగోపాల్, ఆర్నేపల్లి సూరిబాబు, భవానీ శంకర్, కొండపల్లి వెంకన్న మార్యదపూర్వకంగా కలిసి సత్కరించారు.



సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు త్రిమూర్తులు

పదో రోజుకు చెత్త వ్యాన్ డ్రైవర్ల సమ్మె

పెనమలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తమ జీతాల కోసం తాడిగడప మునిసిపాలిటీ చెత్తసేకరణ వ్యాన్‌డ్రైవర్ల సమ్మె బుధవారంతో పదో రోజుకు చేరింది. మొత్తం 42మంది వ్యాన్ల డ్రైవర్లు చేస్తున్న సమ్మెవల్ల మునిసిపాలిటీలోని ప్రతి వీధిలో చెత్త పోగుబడి స్థానికులకు అంటువ్యాధులను కొనితెచ్చే ప్రమాదం పొంచి ఉంది. వ్యాను డ్రైవర్ల సమ్మెకు పదో రోజు స్థానిక సీఐటీయూ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ, వ్యాను డ్రైవర్ల సమ్మెతో మునిసిపాలిటీ కంపు కొడుతున్నా...అధికారుల్లో ఇసుమంతయినా చలనం లేకపోవడం దారుణమన్నారు. కార్మికుల కుటుంబాలు మూడు నెలల జీతాలు లేకపోవడంతో ఇంట్లో గడవక, పిల్లల స్కూలు ఫీజులు కట్టుకోలేక దొరికిన చోటల్లా అప్పులు తెచ్చి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సరళ, కొండలు, రత్నకరుణ, విజయలక్ష్మి, మస్తాన్‌వలి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీపీ దేవినేని జన్మదినం

కంకిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఈడుపుగల్లు, గోసాల, వణుకూరు గ్రామాల్లో దేవినేని రాజా జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడుపుగల్లు ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ఈడుపుగల్లులోని శ్రీనివాసపురం కాలనీ, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీతో పాటు గోసాల, వణుకూరు గ్రామ ప్రజలు తనను ఆదరించి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించటం మరిచిపోలేనన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, మాజీ జెడ్పీటీసీ గొంది శివరామకృష్ణ ప్రసాద్, అనుమోలు ప్రభాకర్, బోడె వెంకట్రామ్, టీడీపీ జిల్లా కార్యదర్శి సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, మాజీ సర్పంచ్ మాబు సుబాని, ఉప సర్పంచ్ కిలారు శ్రీను, పర్వతనేని కోటేశ్వరరావు, వెంకట శ్రీనివాస్, పుట్టగుంట రవి, లంకా రవి, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



గజమాలతో మాజీ ఎంపీపీ దేవినేని రాజాను సత్కరిస్తున్న సర్పంచ్ పందిపాటి ఇందిర, స్థానిక టీడీపీ నాయకులు

కూటమి పాలనలో గ్రామాల అభివృద్ధి



దంటగుంట్లలో రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ యజ్ఞవరపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్/కంకిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనలో గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించటం హర్షణీయమని సర్పంచ్ యజ్ఞవరపు వెంకట రంగారావు అన్నారు. దంటగుంట్లలో ప్రధాన రహదారి అభివృద్ధికి బుధవారం పాలకవర్గ సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లి రవిబాబు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గలావల్లి సత్యనారాయణ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కంకిపాడు : కంకిపాడులో రూ. 46 లక్షలతో చేపట్టిన పలు రహదారుల అభివృద్ధి పనులకు సర్పంచ్ బాకి రమణతో కలిసి టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, వైస్ ఎంపీపీ దూళిపూడి కిషోర్, స్థానిక టీడీపీ నాయకులు కొండా నాగేశ్వరరావు, చలవాది రాజ, వణుకూరు విక్రం, శివ పార్వతి, జనసేన పార్టీ నాయకులు బోయిన నాగరాజు, బీజేపీ నాయకులు దివి రోహిణి, పువ్వాడ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నేత తుమ్మలపల్లి హరికృష్ణ

● మద్దూరులో రహదారి అభివృద్ధి పనులకు సర్పంచ్ చిప్పల దాను శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాసరావు, మద్దూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు యనమదల మదన్‌మోహన్, ఈవో చింతా కిరణ్ కుమార్, స్థానిక టీడీపీ నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కోనాయిచెరువు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త తరలింపుపై అధికారులతో చర్చిస్తున్న డీపీవో అరుణ

చెత్త నిల్వలు పరిశీలించిన డీపీవో

గన్నవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం పట్టణంలోని కోనాయిచెరువు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త కుప్పలను తరలించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారిణి అరుణ బుధవారం ప్రజా ప్రతినిధులతో కలసి చెత్త నిల్వలు పరిశీలించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు ఇక్కడి చెత్త నిల్వలను సాధ్యమైనంత త్వరగా బయటకు తరలించాలని ఆమె ఆదేశించారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఉప సర్పంచ్ పాలడుగు నాని, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు, శొంఠి కిషోర్, ఎంపీడీవో స్వర్ణలత, ఈవోపీఆర్డీ భారతి, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

కూచిపూడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిపై నిడుమోలు సమీపంలోని మద్దిరావమ్మ గుడి వద్ద రోడ్డు ప్రమాదంలో విజయవాడకు చెందిన ట్రక్కు ఆటో డ్రైవర్ సంకాబత్తిన సన్యాసిరావు (55) మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. కూచిపూడి ఎస్ఐ సుబ్రహ్మణ్యం అందించిన వివరాల ప్రకారం ట్రక్కు ఆటో విజయవాడ నుంచి ఫ్రూట్స్ లోడుతో మచిలీపట్నం వైపు వెళ్తుండగా, వెనుకనుంచి మినీ వ్యాన్ ఢీకొట్టింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	131, 140, 151
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.540

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా నవంబరు 2వ తేదీ నుంచి ప్రతి శని, ఆదివారాల్లో పంచారామాలకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు తెలిపారు. రాత్రి 12గంటలకు సర్వీసు ప్రారంభమవుతుందని, ఒక్కొక్కరికి రూ.1200 చార్జీ ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 99632 84363, 73829 03240, 73280 0995కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని, బృందాలుగా వెళ్లే వారికి బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తాం

● హామీల అమలుకు కూటమి ప్రభుత్వంపై ఉద్యమిస్తాం

● కాంగ్రెస్ పార్టీ జిల్లా వ్యవహారాల ఇన్‌చార్జి ఎం.బాబ్జీ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని పీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ కృష్ణాజిల్లా వ్యవహారాల ఇన్‌చార్జి ఎం.బాబ్జీ అన్నారు. బుధవారం డీసీసీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. జిల్లాలోని మండలాల నాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పెడన, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో త్వరలో పర్యటిస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేదాకా ఉద్యమిస్తామన్నారు. సూపర్‌సిక్స్ పథకాలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ, పీసీసీ ప్రధాన కార్యదర్శి మొవ్వ మోహనరావు, మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి అబ్దుల్ మతీన్ పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేయాలి: గొల్లు కృష్ణ

అవనిగడ్డ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం అవనిగడ్డలోని ఓ ఫంక్షన్ హాలులో పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో పార్టీ జిల్లా వ్యవహారాల ఇన్‌చార్జి ఎం.బాబ్జీతో కలిసి ఆయన పాల్గొన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా, ప్రభుత్వ హామీల అమలు కార్యరూపం దాల్చలేదని గొల్లు కృష్ణ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతిపక్ష హోదా లేకపోయినప్పటికీ ప్రజా సమస్యలపై ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.



బంటుమిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

బంటుమిల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని బంటుమిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.8,114 కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మోపిందని, స్మార్ట్ మీటరు విధానాన్ని తెచ్చి, పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తూ కార్పొరేట్ రంగానికి ఊడిగం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు. ధర్నాలో నాయకులు మాజేటి శివశ్రీనివాసరావు, గౌరిశెట్టి నాగేశ్వరరావు, వంగలరాజు, ధనశ్రీ, అజయ్‌ఘోష్, నాగిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.



డీటీ శ్రీలతకు వినతిపత్రం అందిస్తున్న రామానగరం మహిళలు

మద్యం షాపునకు అనుమతి ఇవ్వొద్దు

చల్లపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రామానగరం హిందూ స్మశానవాటిక ఆవరణలో మద్యం షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దంటూ తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీలతకు మహిళలు వినతి పత్రం అందించారు. షాపు ఏర్పాటుచేసే ప్రదేశం యాక్సిడెంట్ జోన్ అని, మద్యం షాపు ఏర్పాటుతో ఆ ప్రాంతం మరింత ప్రమాదకరంగా మారుతుందని వారు వివరించారు. మద్యం షాపు ఏర్పాటుతో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.



కబడ్డీ, ఖో-ఖో రాష్ట్ర పోటీలకు విద్యార్థినులతో హెచ్ఎం

లింగారెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులు

కోడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ, ఖో-ఖో రాష్ట్ర పోటీలకు లింగారెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు కె.నాగరత్నకుమారి తెలిపారు. జగ్గయ్యపేట హైస్కూల్‌లో ఈనెల 22న నిర్వహించిన ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి అండర్-17 కబడ్డీ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి పి.మధుప్రియ, గుడివాడ ఎస్పీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో ఈనెల 20న ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-16 ఖో-ఖోలో 9వ తరగతి విద్యార్థులు బి.దివ్య, పి.మధుప్రియ, పి.లావణ్య, డి.నాంచారమ్మ, పదో తరగతి విద్యార్థిని మహేశ్వరి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో అన్నమయ్య జిల్లాలో, 25 నుంచి 27 వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు బీపీఎల్ ప్రసాద్ తెలిపారు.

మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలు

కోడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మత్తు పదార్థాల వినియోగంతో అనేక అనర్థాలు కలుగుతాయని, మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాల, కోడూరు కోట రాఘవయ్య విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాలకాయితిప్ప మెరైన్ ఎస్సైలు జిలాని, ఉజ్వల్, హెచ్ఎం ఏవీ రమణ, ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, జగన్ పాల్గొన్నారు.

నాగాయలంక పీఎస్‌లో ఓపెన్‌హౌస్

నాగాయలంక, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఎస్పీ ఆర్.గంగాధర రావు ఆదేశాలు మేరకు బుధవారం నాగాయలంక పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలు, సాంకేతిక ఉపకరణాలను ఓపెన్ హౌస్‌లో ప్రదర్శించారు. ఎస్సై కె.రాజేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అధ్వానంగా..



బర్రంకుల-నాలి రహదారిపై గుంతలు

బర్రంకుల-నాలి రహదారి

● అవస్థలు పడుతున్న ప్రజలు

● రహదారి నిర్మించాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి-నాగాయలంక)

అడుగడుగునా గుంతలతో బర్రంకుల- నాలి రహదారి అధ్వానంగా ఉంది. తలగడదీవి వంతెన నుంచి బర్రంకుల- నాలి గ్రామాలకు వెళ్లే జడ్పీ రహదారి ఆరు కిలోమీటర్ల మేర ఉంటుంది. ఈ రోడ్డుకు దశాబ్దం క్రితం తాత్కాలిక మరమ్మతులు చేశారు. తర్వాత వచ్చిన ఏ ప్రభుత్వమూ ఈ రహదారిని పట్టించుకోలేదు. కాలక్రమేణా రోడ్డు అడుగడుగునా గుంతలు పడి వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తోంది. ఈ రహదారిపై నాలి, బర్రంకుల గ్రామాల నుంచి నాగాయలంకకు రోజూ ప్రజలు, రైతులు, విద్యార్థులు నిత్యం వాహనాలపై ప్రయాణిస్తుంటారు. నాగాయలంక నుంచి బర్రంకుల, నాలి గ్రామాలకు ఉద్యోగులు, ఇతర గ్రామాల వారు వస్తుంటారు. అధ్వానపు రహదారిపై ప్రయాణానికి అవస్థలు పడుతున్నామని, కూటమి ప్రభుత్వం ఈ రహదారిని తక్షణమే నిర్మించి బర్రంకుల - నాలి గ్రామాలకు ప్రయాణ సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతల్లో నిలిచిన నీటిని చూపుతున్న గ్రామస్థుడు

పొలం వెళ్లాలంటే అవస్థలే..



బర్రంకుల - నాలి రహదారి గోతుల మయంగా మారింది. ఈ రహదారిపై పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. తక్షణమే మరమ్మతులు చేయాలి.

- తోట లక్ష్మణరావు, రైతు, బర్రంకుల

రాత్రి ప్రయాణం భయమేస్తోంది



బర్రంకుల - నాలి రోడ్డు చాలా ఏళ్ల కిందటే ధ్వంసమైంది. రాత్రిపూట ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే భయమేస్తోంది. నాగాయలంక నుంచి బర్రంకులకు పని మీద వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి. అధికారులు త్వరగా సమస్య పరిష్కరించాలి.

- లంకే శ్రీనివాసప్రసాద్, నాగాయలంక

మరమ్మతులకు అంచనాలు పంపాం

రోడ్డు మరమ్మతుల కోసం రూ.5 లక్షలతో అంచనాలు తయారు చేశాం. ఉన్నతాధికారులకు పంపాం.

- ఎస్.వాసుదేవరావు, పంచాయతీరాజ్ ఏఈ

పాడిరైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

పెడన, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాడిరైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కృష్ణా మిల్క్ పని చేస్తోందని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం చిట్టిపాలెం, గంటలమ్మపాలెం పాల సంఘాలను ఆయన సందర్శించారు. సంఘాల్లో పాడి రైతులతో సమావేశాలు నిర్వహించి పాల ఉత్పత్తిదారులకు యూనియన్ అమలు చేస్తున్న క్షీరబంధు, కల్యాణమస్తు, ప్రతిభ పథకాలపై అవగాహన కల్పించారు. కృష్ణామిల్క్ యూనియన్ డైరెక్టర్ అర్జా వెంకటనగేష్, టి.సత్యనారాయణ, చండిక నాగబాబు, చండిక విజయలక్ష్మి పాల్గొన్నారు.



గంటలమ్మపాలెంలో పాడి రైతులతో మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు



లోకేశ్ తండ్రి వీరబాబుకు రూ.26 వేలు అందిస్తున్న సీఐ యువకుమార్, ఎస్వీఎల్ కళాశాల విద్యార్థులు

తోటి విద్యార్థికి బాసటగా..

అవనిగడ్డ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన తోటి విద్యార్థికి ఎస్వీఎల్ కళాశాల విద్యార్థులు బాసటగా నిలిచారు. కోడూరు మండలం నక్కవానిదారి గ్రామానికి చెందిన పచ్చ లోకేశ్ ఎస్వీఎల్ కళాశాలలో చదువుతున్నాడు. ఇల్లు, పశువుల చావిడి అగ్ని ప్రమాదంలో దగ్ధమై, ఆ కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. తోటి విద్యార్థి కష్టంలో ఉన్నాడని కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు చేసిన సూచనతో విద్యార్థులు స్పందించారు. రూ.26 వేలు, దుస్తులు, నిత్యావసరాలు సమకూర్చారు. బుధవారం సీఐ యువకుమార్‌తో నగదును లోకేశ్ తండ్రి వీరబాబుకు అందించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, రాజేంద్ర పాల్గొన్నారు.

ఆలపాటి గెలుపు తథ్యం

● టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): కూటమి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు తథ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ పేర్కొన్నారు. బుధవారం శిడింబి అగ్రహారంలోని తన కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఫాం-18కి ప్రొవిజనల్ సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, ఓటర్ ఐడీ జిరాక్స్‌ను జతచేసి తెస్తే ఉచితంగా నమోదు చేస్తామన్నారు.

ఓటు నమోదుకు 200 దరఖాస్తులు

చల్లపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటు నమోదు కార్యక్రమంలో చల్లపల్లిలోని ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి 200 దరఖాస్తులు అందాయి. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివకు బుధవారం పలు పాఠశాలల ప్రతినిధులు దరఖాస్తులను అందించారు. పైడిపాముల స్వప్న, షేక్ నబీషోరి పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

పెడన, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు సమాచార హక్కు, బాల్య వివాహాల నిర్మూలన, విద్యా హక్కు, బాలకార్మికుల నిర్మూలన, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ బొడ్డపాటి దాస్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోవాడ ప్రశాంతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఆర్.ఎస్.రెడ్డి, కో-ఆర్డినేటర్ ఎస్.అనిల్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ ప్రతినిధులకు శిక్షణ



సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ ఇస్తున్న కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డి.సుధారాణి

ఘంటసాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్‌లు) మెరుగైన సేవలు అందించాలని, సమగ్ర పోషక యాజమాన్యంపై ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను పీఏసీఎస్‌ల ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి సూచించారు. బుధవారం కేవీకేలో సమగ్ర పోషక యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సు కింద కృష్ణా, ఏలూరు జిల్లాల్లోని పీఏసీఎస్‌ల ప్రతినిధులకు జాతీయ, రాష్ట్ర వ్యవసాయ విస్తరణ సంస్థల ఆధ్వర్యంలో 15 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి, కృష్ణా జిల్లా సహకార సంఘం అధికారి చంద్రశేఖర్ రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు, పరిశోధనా స్థానం శాస్త్రవేత్త లహరి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో లద్దె పురుగు నివారణ

ఘంటసాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలు, తేమ కారణంగా మెట్ట భూముల్లో మినుము, పొగాకు పంటల్లో లద్దె పురుగు ఆశించినట్లు గుర్తించామని, రైతులు ఆందోళన చెందొద్దని, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి సూచించారు. పురుగు ఉధృతి తక్కువగా ఉంటే క్లోరోపైరిఫాస్ 2.5 ఎంఎల్ లేదా ఎసిఫేట్ గ్రాము లేదా దయోడాకార్బ్ గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని ఆమె సూచించారు. పురుగు అధికంగా ఉంటే స్పైనోశాడ్ 0.3 ఎంఎల్ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేక క్లోరాంత్రానిల్‌ప్రోల్ 0.3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఐదు కిలోల తవుడు, అరకిలో బెల్లం, 500 ఎంఎల్ క్లోరోపైరిఫాస్ 500 ఎంఎల్ సరిపడా నీటిలో కలిపి చిన్న ఉండలు చేసి సాయంత్రం పొలాల్లో వెదజల్లాలని ఆమె సూచించారు.

గ్రామసభలు సద్వినియోగం చేసుకోండి

మోపిదేవి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి సూచించారు. బుధవారం నాగాయితిప్ప గ్రామసచివాలయం వద్ద నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. రీ సర్వేలో కొంత మంది పేర్లు తొలగించటం, మరి కొంతమంది పేరున భూములు ఉన్నట్లు నమోదు చేయటం జరిగిందని, వాటిని పరిష్కరించాలంటూ గ్రామానికి చెందిన గరికపాటి కోటేశ్వరరావు, కంఠమనేని బాపయ్యలు అధికారులకు అర్జీ ఇచ్చారని, వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తహసీల్దార్ సమక్షంలో పరిష్కరిస్తామని మండల సర్వేయర్ రామకృష్ణ రైతులకు తెలిపారు. సర్పంచ్ గరికపాటి వెంకటేశ్వరరావు, ఆర్ఐ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చోడవరంలో..

నాగాయలంక, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చోడవరం గ్రామంలో భూముల రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రఫీ, సర్వేయర్ రామకృష్ణ పాల్గొన్నారు.

పామాయిల్ తోటల సాగుపై దృష్టి సారించండి

మోపిదేవి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ తోటల సాగుపై దృష్టి సారించాలని రైతులకు ఉద్యాన శాఖాధికారి రమేష్ సూచించారు. బుధవారం ఉత్తరచిరువోలులంక, కోసూరువారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులు సాగు చేస్తున్న వరి, కూరగాయల తోటలను రైతులతో కలసి వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించారు. పామాయిల్ తోటల సాగు చేసే రైతులకు రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖాధికారిణి హెప్సీబారాణి, సర్పంచ్ కోసూరు అనూష, ఆయిల్‌పామ్ కంపెనీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రావి జగదీష్ చంద్రబాబు, మేనేజర్ శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

రూ.35 కోట్లతో అభివృద్ధి పనులు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బందరు మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.35 కోట్లతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద అభివృద్ధి పనులు చేపట్టినట్టు మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం చిన్నాపురంలో రూ.కోటి 60 లక్షలతో చేపట్టిన రోడ్లు, ఇతర పనులకు సర్పంచ్ కాగిత గోపాలరావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. చిన్నాపురంలో స్మశానాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు సర్పంచ్ పేర్కొన్నారు. తొలుత ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో డ్రెయిన్లు నిర్మించేందుకు అవకాశం కల్పించారని, అయితే ఆ అవకాశం లేకపోవడంతో నిరాశకు గురయ్యామన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కేశన రమేష్, జనసేన నాయకుడు చలమలశెట్టి వెంకటరమణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాట్రగడ్డ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



చిన్నాపురంలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, సర్పంచ్ కాగిత గోపాలరావు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	131,140,151
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మొవ్వ, కోసూరు విద్యార్థులు

కూచిపూడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మొవ్వ, కోసూరు జడ్పీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్టు పీడీ అప్పికట్ల రామారావు తెలిపారు. మొవ్వ జడ్పీ పాఠశాల నుండి అండర్-14 బాలుర విభాగంలో ప్రదీప్ కుమార్, అండర్-17 విభాగంలో యోగేశ్వర్ ఎంపికైనట్టు తెలిపారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వివరించారు. కోసూరు నుండి అండర్-14 విభాగంలో నమ్రత, ప్రభుకుమార్‌లు ఎంపికయ్యారు. వీరు వచ్చే నెల 9, 10 తేదీల్లో బాపట్ల జిల్లా పిట్లవానిపాలెంలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పి.శివకోటేశ్వరరావు, బి.నాగమణి, పిడిలు రామారావు, చందులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

కూచిపూడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిపై నిడుమోలు సమీపంలోని మద్దిరావమ్మ గుడి వద్ద రోడ్డు ప్రమాదంలో విజయవాడకు చెందిన ట్రక్కు ఆటో డ్రైవర్ సంకాబత్తిన సన్యాసిరావు (55) మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. కూచిపూడి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం అందించిన వివరాల ప్రకారం ట్రక్కు ఆటో విజయవాడ నుంచి ఫ్రూట్స్ లోడుతో మచిలీపట్నం వైపు వెళ్తుండగా, వెనుకనుంచి మినీ వ్యాన్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ సన్యాసిరావుకు తీవ్ర గాయాలవటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.



పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

పొడి, తడి చెత్తను వేరు చేయాలి

గుడివాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలు తమ ఇళ్లలోని చెత్త,చెదారాలను పొడి, తడి చెత్తను వేరుగా చేసి చెత్త సేకరణ వాహనాలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఉదయం పట్టణంలోని ఏలూరురోడ్డు, కోతిబొమ్మ సెంటర్, బంటుమిల్లి రోడ్డు, చెంచుకాలనీ, కెటీఆర్ కళాశాల రోడ్డు, బస్టాండ్ రోడ్డు, భాస్కర్ థియేటర్ రోడ్డు, మందపాడు, ఆర్‌డివో కార్యాలయం రోడ్డు, రాజేంద్రనగర్, గుడ్‌మెన్‌పేట, నీలామహల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటించి పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. ప్రతీ రోజు ప్రధాన రహదారుల్లో బ్రషింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ రోజు సాయంత్రం 3వార్డుల్లో ఫాగింగ్ చేస్తున్నామని కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు వేరుగా ప్రాంతాల్లో పర్యటించి చెత్త సేకరణను పరిశీలించారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

గుడివాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గంగాపార్వతీ సమేత శ్రీభీమేశ్వరస్వామి దేవస్థాన హుండీ ఆదాయ లెక్కింపు కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీ గురువారం దేవాదాయ శాఖ గుడివాడ తనిఖీదారు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్టు దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల భక్తులు లెక్కింపులో పాల్గొనవచ్చన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గుడివాడ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం గుడివాడ రూరల్ మండలం బొమ్ములూరు గ్రామంలో 40 లక్షలతో నిర్మితమవుతున్న సీసీ రోడ్లకు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొమ్ములూరు గ్రామానికి వివిధ రోడ్ల కింద తమ ప్రభుత్వ హయాంలో 40 లక్షల నిధులు మంజూరైనట్టు తెలిపారు. పనులు ప్రారంభించి జనవరికి రోడ్లు ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. గ్రామా ల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయటానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. బొమ్ములూరు గ్రామం ఎప్పుడూ టీడీపీకి అనుకూలంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు వాసే మురళీ, మాజీ ఎంపీపీ బాలకృష్ణ, పార్టీ అధ్యక్షులు శొంఠి నాగేశ్వరరావు, బొమ్ములూరు గ్రామస్థులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బొమ్ములూరులో అన్నదానం

గుడివాడ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : గుడివాడ రూరల్ మండలం బొమ్ములూరు గ్రామంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం యాదవులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బొమ్ములూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బొమ్ములూరు గ్రామానికి చెందిన వేలాది మంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

పామర్రు, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ స్థాయిలో బలోపేతమే మన అందరి లక్ష్యమని రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి, మోవ్వా మోహనరావు అన్నారు. స్థానిక శివరామ్ కాంప్లెక్స్‌లో బుధవారం నిర్వహించిన ఆపార్టీ ముఖ్య నేతల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు మండలాల్లో పార్టీ పరిస్థితిపై ముఖ్యనేతలనుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో సానుకూల దృక్పథం కనిపిస్తోందన్నారు. ఈకార్యక్రమంలో మర్నెడి బాబ్జి, గోల్లు కృష్ణ, టిసాంబశివరావు, బాణావత్ భుజంగ నాయక్, వల్లూరి గాంధీ, కె.సోమేశ్వరావు, చాట్ల నిర్మల, సఖీ, శాస్త్రి పాల్గొన్నారు.

31వ వార్డులో అన్నదానం

గుడివాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : శాంతి నిమిత్తం అన్నదానం చేయడం అభినందనీయమని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక 31వవార్డులో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31వ వార్డు భక్తబృందం ఆధ్వర్యంలో వైభవంగా దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ఘనంగా ముగియడంతో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ వసంతవాడ దుర్గారావు, టీడీపీ నాయకులు బొంబాయి శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

బస్టాండ్ చుట్టూ ఆక్రమణలు!

అధికారుల అలసత్వంపై విమర్శలు

(కూచిపూడి -ఆంధ్రజ్యోతి)

కూచిపూడి బస్టాండ్ చుట్టూ ఉన్న ఆక్రమణలపై అధికారులు అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సర్వే నెంబర్ 38/1, 38/2లో ఉన్న ఆక్రమణలు (42 దుకాణాలు) తొలగించాల్సిందిగా కూచిపూడి గ్రామపంచాయతీ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో ఆక్రమణదారులకు నోటీసులిచ్చి తొలగించాల్సిందిగా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆదేశాలిచ్చి మూడు నెలలు కావొస్తున్నా ఆక్రమణల తొలగింపుకు అధికారులు నేటి వరకూ చర్యలు చేపట్టలేదు. ఆక్రమణలు తొలగిస్తే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామని గ్రామపంచాయతీ భావిస్తుంది. ఆక్రమణదారులు మరో కోర్టునుఆశ్రయించే విధంగా అధికారులు తాత్సారం చేస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.



కూచిపూడి బస్టాండ్ చుట్టూ ఉన్న ఆక్రమణలు

ఈవో పుష్పనాథం వివరణ

తాను బదిలీపై ఇటీవలనే కూచిపూడి వచ్చానని, ఈ విషయాలకు సంబంధించిన ఫైలును పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు చేపడతానని తెలిపారు.

కోర్టు ఆదేశాలు అమలు చేయాలి

ఆక్రమణల తొలగింపుపై గ్రామపంచాయతీ హైకోర్టును ఆశ్రయించగా, ఆక్రమణల తొలగింపునకు ఇటీవల హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అధికారులు కోర్టు ఆదేశాలను వెంటనే అమలు చేయాలి.



మెప్మా బజార్‌లో ఉత్పత్తులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రావి, యలవర్తి

మహిళా సాధికారతే లక్ష్యం : రావి

గుడివాడ, అక్టోబర్23(ఆంధ్రజ్యోతి : మహిళలు మగవారితో సమానంగా కుటుంబ బాధ్యతలను మోస్తున్నారని, కుటుంబానికి శక్తిలా నిలబడటానికి డ్వాక్రా సంఘాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సెంటర్‌లో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, సిఎంఎం భస్మేశ్వరరావు, పట్టణ సమైక్య అధ్యక్ష,కార్యదర్శులు ప్రతిమ, అంజమ్మ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



పతకాల గ్రహీతలతో కళాశాల పాలకవర్గ సభ్యులు

పవర్ లిఫ్టింగ్‌లో ఏఎన్ఆర్ విద్యార్థులకు పతకాలు

గుడివాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ జూనియర్, సీనియర్ పురుషుల పోటీల్లో స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలకు చెందిన పలువురు పతకాలను సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీజేఎస్ కుమార్ తెలిపారు. బుధవారం కళాశాల ఆవరణలో పతకగ్రహీతలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. పతకగ్రహీతలను పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్‌కే ప్రసాద్, కేవీస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, ఫిజికల్ డైరెక్టర్ వీర్ల గోపి, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ముగిసిన ఖో-ఖో జట్ల ఎంపిక

గుడివాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్‌పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జిల్లా జూనియర్ బాలబాలికల ఖో-ఖో జట్ల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. జూనియర్స్ బాలికల జట్టుకు జి.అనీత, కె.వృద్యా, బి.దివ్య, కె.వి ధనలక్ష్మీ, ఎస్.సుప్రజ, డి.చరితశ్రీ, డి.మధుప్రియ, డి.ఎస్.ఎస్ కృష్ణవేణి, పి.లావణ్య, డి.యోధిత, కె.రేష్మశ్రీ, జి.ఉమ, సి.హెచ్ శరణ్య, డి.నాంచారమ్మ, డి.వినీషాలు ఎంపికయ్యారు. జూనియర్ బాలుర జట్టుకు తిమోతి, ఆసిఫ్‌ఖాన్, డి.రాకేష్, డి.షణ్ముఖసాయి, ఎస్.సాయంకుమార్, కె.జయ సూర్యతేజ, సాజిద్ ఖాన్, ఎన్.అనీల్‌కుమార్, డి.కిరణ్‌బాబు, పి.యశ్వంత్, వై.ప్రదీప్, కె.కామేశ్వర లక్ష్మీధర్, కె.జశ్వంత్, ఎ.రోహిత్ వెంకటసాయి, కె.శ్రీనివాసరావులు ఎంపికైనట్టు జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మడక ప్రసాద్, ఎం.వీ సత్యప్రసాద్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాల ఆవరణను ఉపాధ్యాయులు పరిశీలించాలి

గుడివాడ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రతీ రోజూ పాఠశాల ప్రారంభించగానే ఒక్కసారి పాఠశాల ఆవరణను పరిశీలించాలని ఎంఈవో -2 బాలాజీ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక, యుపి, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వివిధ అంశాలపై ఎంఈవోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతీ రోజు పాఠశాల యూనిఫారమ్ ధరించి వచ్చేలా చూడాలన్నారు. బూట్లు, ప్రభుత్వం అందించిన యూనిఫారమ్, బెల్టు, టై ధరించి వచ్చేలా ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. ంఈవో -1 విజయకుమార్, గుడివాడ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ ,ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణ

పామర్రు, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షలకు హాజరు కానున్న ఎస్సీఎస్టీ అభ్యర్థులు ఈనెల 25తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని గుడివాడ డివిజన్ సంక్షేమ శాఖ అధికారి తుంగల వెంకటకృష్ణ బుదవారం ఓప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు సాంఘిక సంక్షేమశాఖ ద్వారా ఉచితశిక్షణ పోందేందుకుగాను జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ఘనంగా అయ్యప్పకు అభిషేకాలు

పామర్రు, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో బుధవారం హరిహర పుత్రుడు అయప్పస్వామికి బోగ్గవరపు సాయిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పంచామృత అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కన్నెస్వాములు పాల్గోని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు

గుడివాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు రక్షణ కల్పించడం, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ అమరవీరుల చేసిన త్యాగాలు ఎన్నటికి మరువలేనివని జిల్లా ఎస్.పి ఆర్.గంగాధరరావు అన్నారు. స్థానిక వెలమ సంక్షేమ సంఘం భవన్‌లో ఒన్‌టౌన్ సి.ఐ కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. స్థానిక పోలీస్ సిబ్బంది, వికెఆర్ అండ్ వీఎన్‌బి ఇంజినీరింగ్ కళాశాల, ఏఎన్ఆర్ కళాశాల విద్యార్థులు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. వీరిని జిల్లా ఎస్.పి గంగాధరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సోసైటీ జిల్లా చైర్మన్ తోట శ్రీరంగ సత్యబాలాజీ, కార్యదర్శి భవిరి శంకరనాథ్, రెడ్ క్రాస్ చైర్‌పర్సన్ స్పందన, వైస్ చైర్మన్ మడకా ప్రసాద్, డాక్టర్ పట్టాభి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డా.హనుమంతయ్య, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

సేంద్రీయ ఎరువులనే వినియోగించాలి

గుడ్లవల్లేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వరిలో ప్రస్తుతం యూరియా అధికంగా వాడటం వల్ల దోమలవృద్ధి ఎక్కువవుతుందని , రైతాంగం యూరియాకు బదులు పొటాష్ వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సునీల్ అన్నారు. బుధవారం వడ్లమన్నాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కాంప్లెక్స్ ఎరువులు వినియోగించకుండా సేంద్రీయ ఎరువులనే వాడుకోవాలని సూచించారు.. ధాన్యాన్ని రైతు కేంద్రాల ద్వారా మాత్రమే అమ్మాలన్నారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు పెన్నేరు రమేష్, జనసేన మండల కన్వీనర్ తోట చిన్నారి పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : పొలాల్లో పొట్ట దశలో ఉన్నందున తెల్లకంకులు రాకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో బోలెం అనంతలక్ష్మి అన్నారు. బుధవారం సెరిదింటకుర్రు, సిద్ధాంతం, శేరివెల్పూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో బోలెం అనంతలక్ష్మి మాట్లాడుతూ రైతులు తెల్ల కంకుల నివారణకు మందులు ముందుగానే పిచికారి చేసుకోవాలన్నారు. ప్రతీ రైతు పొలాలను పరిశీలించి దోమపోటు ఏమైనా ఉన్నట్లైతే సంబంధిత అధికారులకు తెలియజేసి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేరివేల్పూరు సర్పంచ్ మేడేపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

సామాజిక వికాసానికి సంగీతమే ప్రాణం

గుడివాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సామాజిక వికాసానికి సంగీతమే ప్రాణంగా నిలుస్తోందని టూటౌన్ సీఐ చిన్ని నాగ ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక గుడివాడ క్లబ్‌లో ప్రముఖ సినీ రచయిత ఆరుద్ర, దాశరథిల శతజయంతి సందర్భంగా సంగీత విభావరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన సీఐ నాగ ప్రసాద్ మాట్లాడుతూ పండితుల నుండి పామరుల వరకు అందరికీ అర్ధమయ్యే రీతిలో సాహిత్యాన్ని పాటల రూపంలో అందించిన కవిశ్రేష్టులను స్మరించుకోవాలన్నారు. తొలుత ఆరుద్ర, దాశరధి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు గాయకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డ్రీమ్ మీడియా నిర్వాహకులు సి.హెచ్ నరసింహారావు, గాయకులు టి.సాంబశివరావు, పసుపులేటి శ్రీనివాసరావు, విష్ణుప్రియ, అలా వెంకట్రావు, సత్యవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బురిడీ కొట్టిస్తున్న సైబర్ కేటుగాళ్లు

గుడ్లవల్లేరు,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సైబర్ కేటుగాళ్లు రోజురోజుకీ పెరిగిపోతూ వినూత్నంగా బాధితులు పూర్తిగా నమ్మేవిధంగా వేషధారణలు, స్క్రిప్టులు రచించి మరీ దోపిడీలు చేస్తున్నారు. గుడ్లవల్లేరుకు చెందిన ఒక ప్రయివేటు సంస్థ ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు వలపన్నారు. అదృష్టం బాగుండి ఎక్కడో అనుమానం రావడంతో అతను కేటుగాళ్ల వలకు చిక్కినట్టే చిక్కి తప్పించుకొన్న ఉదంతమిది. సదరు ఉద్యోగి చెప్పిన వివరాల ప్రకారం మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి అతనికి ట్రాయ్ నెంబరు నుంచి కాల్ వచ్చింది. మీరు ఎవరు ఎక్కడ ఉంటారు ఏమి చేస్తుంటారని హిందీలో వివరాలు అడుగుతుండగా తనకు హిందీ రాదు తెలుగుమాత్రమే తెలుసని ఉద్యోగి చెప్పారు. తెలుగు తెలిసిన వ్యక్తి లైన్‌లోకి వచ్చి ఉద్యోగి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. మీ నెంబరును సైబర్ క్రైమ్ పోలీసులు ట్రేస్ చేయమన్నారని చెప్పారు. వారు మిమ్మల్ని లైన్‌లోకి తీసుకుని మాట్లాడుతారని చెప్పి లైన్ కలిపారు. ఢిల్లీ సైబర్ క్రైమ్ ఆఫీస్ నుంచి అని మళ్లీ హిందీలో మాట్లాడగా తనకు హిందీ రాదని మళ్లీ చెప్పాడు సదరు ఉద్యోగి. తెలుగు ఎస్‌ఐ సతీష్ (సిరిసిల్ల) పేరిట మరొకరు ఫోన్‌లైన్‌లోకి వచ్చారు. మీ ఆధార్ నెంబరుతో గోయల్ నరేష్ అనే సైబర్ నేరస్తుడు మీ పేరున సెల్ సిమ్‌తో నేరాలకు పాల్పడ్డాడని అతని ఎకౌంట్ నుండి 10 శాతం కమీషన్ మీ ఎకౌంట్‌కు వచ్చాయని వాటిని తిరిగి ఇచ్చేయా లన్నారు. మీమీద కూడా కేసు నమోదు చేస్తున్నామని బెదిరించాడు. ఉద్యోగి కంగుతిన్నాడు నా ఎకౌంట్‌లో మూడు నాలుగు వేల మించి ఉండవని, ఎవరూ నా ఎకౌంట్‌లో డబ్బు వేయలేదని చెప్పాడు. లేదు కెనరా బ్యాంక్ ఎక్కౌంట్‌లో వేశాడని ఎస్‌ఐ సతీష్ అనేవ్యక్తి గట్టిగా గద్దించాడు, తనకు ఆ బ్యాంక్‌లో ఎకౌంటేలేదని చెప్పాడు.



పెదమద్దాలిలో రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వర్ల

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట: ఎమ్మెల్యే వర్ల

పామర్రు, అక్టోబరు 23 ,(ఆంధ్రోజ్యోతి): ప్రజలకిచ్చిన వాగ్దానాల అమల్లో భాగంగా గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని పెదమద్దాలిలో ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ. 50.53లక్షలతో నిర్మితమయ్యే నూతన సీసీ రోడ్లకు బుధవారం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ గ్రామ సర్పంచ్ జెస్సీశాంతికుమారితో కలసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్‌శాఖ విశ్రాంత ఉన్నతాధికారి వివిరావు, గ్రామ టిడిపి జనసేన నేతలు కోల్లిపర ప్రభాకర్‌రావు, కాండ్రు ఏసురత్నం, మిక్కిలినేని పండు, డోక్కు సత్యనారాయణ, కాంతికుమార్‌సింహాద్రి జన్ను శోభన్‌బాబు ఎంపిడిఓ కాండ్రు జ్యోతి, ఎన్ఆర్‌జిఎస్ ఎపిఎం సురేష్‌పిఆర్ఎఈ రామారావు, తదితరులు పాల్గొన్నారు.



శెరిగొల్వేపల్లి సచివాలయంలో తనిఖీ నిర్వహిస్తున్న డీఎల్‌డీవో సుజాత

శెరిగొల్వేపల్లి సచివాలయం తనిఖీ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గుడివాడ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల మేరకు ఉద్యోగులు సచివాలయాల్లో పనిచేయాలని డిఎల్‌డివో సుజాత అన్నారు. బుధవారం శెరిగొల్వేపల్లి సచివాలయంలో జగన్మోహన్‌రెడ్డి ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలు ఉండటంపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన డీఎల్‌డీవో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని, ప్రతీ రోజు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలను ఉద్యోగులు తెలుసుకోవాలన్నారు. ఆ గ్రామ కార్యదర్శి సక్రమంగా విధులు నిర్వహించటం లేదని, ఆయన్ని మందలిస్తామని తెలిపారు. అన్ని సచివాలయాల్లో పర్యవేక్షణ కొనసాగించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు అందుబాటులో తెలిపారు. సచివాలయాల్లో ఆధార్ అనుసంధానం చేస్తున్నట్టు తెలిపారు. నవరత్నాలకు సంబంధించి జగన్ బొమ్మలను మూయించారు. జగన్ ఫోటోలతో ఉన్న ఫ్లెక్సీలు తొలగించారు.

ఆత్మవిశ్వాసంతో మళ్లీ సాగు

4,500 ఎకరాల్లో వరి నాట్లు

బందరు, అవనిగడ్డ నియోజక వర్గంలో వ్యవసాయ పనులు ముమ్మరం

ఎన్నికష్టాలు వచ్చినా తగ్గేదే లే అంటున్న అన్నదాతలు



గుండుపాలెంలో నాట్లు వేసిన పొలంలో ఓ రైతు

ఆంధ్రజ్యోతి,మచిలీపట్నం టౌన్): ఇటీవల వచ్చిన భారీ వర్షాలకు పొలాలు ముంపునకు గురై పంటలను కోల్పోయిన రైతులు దిగాలు పడలేదు. ఆత్మవిశ్వాసంతో మళ్లీ వ్యవసాయ భూముల వైపు సాగుతు న్నారు. ఏ పొలాల్లో అయితే పంట పూర్తిగా దెబ్బతిందో అదే పొలాల్లో మళ్లీ రెండవ సారి నాట్లు వేస్తున్నారు. నేలతల్లిని నమ్ముకున్న రైతుకు అన్యాయం జరగదని నిరూపించేందుకు సిద్ధమయ్యారు. సముద్ర తీరాన ఉన్న కృష్ణాజిల్లాలోని రైతులు తుపానులు, భారీ వర్షాలకు అలవాటు పడ్డారు. ఈ ఏడాది కొన్ని ప్రాంతాల్లో ఖరీఫ్ పంట పూర్తిగా నష్టపోయిన రైతులున్నారు. అలాంటి రైతులు మళ్లీ వరి నాట్లు వేస్తున్నారు. ఇలా కొన్ని పొలాలు ఒక పక్కన ఖరీఫ్ పంటలాగా, మరో పక్క రబీ పంటలాగా కనిపిస్తున్నాయి. ఈ చేలను చూస్తున్న వారు విస్తుపోతున్నారు. రైతుల ఆత్మవిశ్వాసాన్ని అభినందిస్తున్నారు.

పొలాలను అలాగే వదిలేయలేక..

కృష్ణాజిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అనేక మంది రైతులు పంటలు నష్టపోయారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కూడా అందుకున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పచ్చగా కళకళలాడే పొలాన్ని బీడుగా వదిలేయలేక రెండవ సారి వరి నాట్లు వేస్తున్నారు. నారుమళ్లు పోసి నాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. దీంతో బందరు మండలంలో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. బందరు, ఘంటసాల, గూడూరు, కృత్తివెన్ను మండలాల్లో సుమారు 4500 ఎకరాల్లో రెండవ సారి వరి నాట్లు వేస్తున్నారు. బందరు మండలంలో ఎస్.ఎన్.గొల్లపాలెం, గుండుపాలెంలో 120 రోజుల్లో పంట చేతికి వచ్చే 1262 వరి వంగడం సాగు చేస్తున్నారు.



ఒక వైపు పచ్చగా, మరో వైపు నాట్లకు సిద్ధంగా

30 ఎకరాల్లో నాట్లు వేస్తున్నాం



పదెకరాల్లో ఇరవై రోజుల కిందట రెండవ సారి వరి నాట్లు వేశాం. మళ్లీ వర్షా లు రావడంతో నేల దున్నినా నీరు పొలాల నిండా ఉండటంతో నాట్లు వేయలేకపోయాం. కొంచెం నీరు మురుగుకాలువల్లోకి వెళ్లిన తర్వాత మిగిలిన 20 ఎకరాల్లో వరి నాట్లు వేయడం ప్రారంభించాం.

- ఉక్కా నరసింహులు, రైతు, ఎస్.ఎన్. గొల్లపాలెం

బెంగపడితే ఎలా



పంట నష్టపోయానని బెంగపడలేదు. ధైర్యంగా మళ్లీ రెండవ సారి వరి నాట్లు వేశాను. 120 రోజుల్లో పంట చేతి కొస్తుందనే ధీమా ఉంది. వ్యవసాయ శాఖాధికారులు మాకు సరై న సలహాలిస్తే మరింత దిగు బడిని సాధించగలుగుతాం.

- బొప్పన వెంకట అప్పారావు, రైతు, గుండుపాలెం

పదెకరాలు నాటా.. మరో 20 ఎకరాల్లో వేస్తా



ఈ వారంలో పదెకరాల్లో రెండవ సారి నాట్లు వేశా. మరో ఇరవై ఎకరాల్లో వరి నాట్లు వేయబోతున్నాను. మురుగు కాలువలకు మరమ్మతులు చేయిస్తే రైతులకు కష్టాలు తప్పుతాయి. చాలా ఏళ్లుగా మురుగు కాలువల పూడికతీత పనులు చేయడం లేదు. అందు వల్ల మేము పంట నష్టపోతున్నాం. ఇప్పటికైనా అధికారులు వేసవిలో మురుగు కాలువలకు పూడిక తీయాలని కోరుతున్నాం.

- తూమాటి కృష్ణారావు, రైతు, గుండుపాలెం

53 రైళ్ల రద్దు



- 'దానా' తుఫాన్‌తో రైల్వేశాఖ హైఅలర్ట్
- రద్దయిన బెజవాడ మీదుగా పాసింగ్ అయ్యే రైళ్లు
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి,విజయవాడ): దానా తుఫాన్ నేపథ్యంలో రైల్వేశాఖ హై అలర్ట్ ప్రకటించింది. విజయవాడ మీదుగా వెళ్లే రైళ్లను రద్దు చేసింది. తుపాను ప్రభావిత ప్రాంతాలను టచ్ చేసే మొత్తం 53 రైళ్లు రద్దయ్యాయి. విజయవాడ డివిజన్ పరిధిలో లోకల్ రైళ్లకు పెద్దగా సమస్య లేకపోయినా.. విజయవాడ మీదుగా పాసింగ్ అయ్యే దూర ప్రాంత రైళ్లు మాత్రం పెద్ద సంఖ్యలో రద్దు అయ్యాయి. బెంగళూరు నుంచి విజయవాడ మీదుగా హౌరా వెళ్లే రైళ్లు, హైదరాబాద్ నుంచి షాలిమార్ వెళ్లే రైళ్లు, పాట్నా నుంచి ఎర్నాకుళం వెళ్లే రైళ్లు, సికింద్రాబాద్ - భువనేశ్వర్ , బెంగళూరు - గౌహతి, ముంబాయి - భువనేశ్వర్, కన్యాకుమారి - దిబ్రుఘర్, తంబారం - సంత్రాగచిల మధ్య నడిచే రైళ్లను పెద్ద సంఖ్యలో రద్దు చేశారు. ఈ రైళ్లన్నీ విశాఖ పట్నం, విజయవాడల మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. రెగ్యులర్ సర్వీసులే అయినా.. ఇవి విజయవాడ పాసింగ్ త్రూ రైళ్లుగా ఉన్నాయి. తుఫాన్ తీవ్రతను బట్టి మరిన్ని రైళ్లను రద్దు చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇప్పటి వరకు ఇంటర్ జోన్ రైళ్లకు ఇబ్బంది ఎదురు కాలేదు. లోకల్‌గా కూడా రైళ్లను రద్దు చేయాల్సి వస్తే మాత్రం మరింత పెద్ద సంఖ్యలో రైళ్లు రద్దు అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇదే జరిగితే వేలాది మంది ప్రయాణికులు తమ ప్రయాణాలను రద్దు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు మొత్తం 14 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, సామర్లకోట, నెల్లూరు, రాజమండ్రి, అనకాపల్లి, ఏలూరు, గూడూరు, నిడదవోలు, ఒంగోలు, తాడేపల్లిగూడెం, తునిల లో కంట్రోల్ రూమ్‌లు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. విజయవాడలో కంట్రోల్ రూమ్ నంబర్ 8662576924ను సంప్రదించి సమాచారం పొందవచ్చు. విజయవాడ నుంచి ముందుగా రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు డబ్బులను వాపసు చేసే కార్యక్రమాన్ని కూడా రైల్వే అధికారులు ప్రారంభించారు.

అంతర్ కళాశాలల కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి

గుణదల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల విభాగం కబడ్డీ పోటీలు బుధవారం నిర్వహించారు. మొత్తం 11 కళాశాలల నుంచి విద్యార్థులు తరలిరాగా, పోటీలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ప్రారంభించారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ యుగంధర్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలి

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



ధర్నాచౌక్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ పథకాలను సీఎం చంద్రబాబు తక్షణమే అమలు చేయాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడారు పోలవరం ప్రాజెక్టు మరో వందేళ్లయినా పూర్త వదన్నారు. పోలవరం రాజకీయ నేతలకు వరంలా మారిందని విమర్శించారు. ఈవీఎంలు కాకుండా బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరిగితేనే దేశంలో ప్రజాస్వామ్యం నిలబడుతుందన్నారు. ప్రతిపక్షాలు బలహీనంగా ఉన్న చోట బీజేపీ ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తుందని ఆరోపించారు. విభజన తర్వాత రాష్ట్రం బాగా నష్టపోయిందని, కనీసం బడ్జెట్ ప్రవేశపెట్టే పరిస్థితి లేదన్నారు. హరియాణలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి ఆ పార్టీ నాయకుల ఓవర్ కాన్ఫిడెన్స్, ఈవీఎంల ట్యాంపరింగ్ కారణమన్నారు.

పంపిణీదారుల పట్ల విప్రో వైఖరి సరికాదు



ధర్నాచౌక్,అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : పంపిణీదారుల పట్ల విప్రో కంపెనీ వైఖరి సరికాదని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సి.ఎస్.ప్రసాద్, అఖిల భారత పంపిణీదారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్.కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ నగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో బుధవారం అసోసియేషన్ నేతల సమావేశం జరిగింది. అనంతరం వీరు విలేకరులతో మాట్లాడుతూ భయభ్రాంతులకు గురిచేసే ఆంక్షలు విధిస్తూ వారి విధి విధానాలను తరచూ మారుస్తూ పంపిణీదారులను కోలుకోలేని నష్టాల్లోకి నెటారని ఆరోపించారు. సంస్థ యాజమాన్యం తమ వైఖరి మార్చుకోకుంటే కొనుగోళ్లను నిలిపివేసేందుకు నిర్ణయం తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యనారాయణ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించకుంటే ధర్నా చేస్తాం

-ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు



ధర్నాచౌక్, అక్టోబర్ 23: (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భూ సమస్యలు పరిష్కరించాలని లేదంటే నవంబర్ మొదటి వారంలో విజయవాడలో భారీ ధర్నా చేపడతామని ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి పేదలకు ఇచ్చేందుకు, కోనేరు రంగరావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేసి భూమి లేని పేద కుటుంబాలకు భూ పంపిణీ చేయాలని కోరాయి. 'భూ సమస్యలు-- చట్టాల అమలు- ప్రభుత్వ పాత్ర' అనే అంశంపై గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన రీసర్వేపై టీడీపీ ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఆలిండియా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, భారత కేత్ మజూరు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్, దడాల సుబ్బారావు, కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాస్, నేత రాధాకృష్ణ పాల్గొన్నారు.

రఫీ హత్య వెనుక ఏం జరిగింది?

- నరసింహరాజుపై మృతుడి కుటుంబం తీవ్ర ఆరోపణలు
- మంచివాడే అంటున్న నరసింహరాజు సన్నిహితులు
- ఆర్థిక వ్యవహారాలపై పోలీసుల ఆరా



విజయవాడ, అక్టోబరు 23(ఆంధ్ర జ్యోతి): అయోధ్యనగర్ లోటస్‌లో జరిగిన మహ్మద్ రఫీ హత్య వెనుక కుట్రలు ఉన్నాయా? ఇద్దరూ ప్రాణ స్నేహితులే అయినా వారి మధ్య వివాదాలు నడుస్తున్నాయా? ఇద్దరూ వ్యాపా రంలో భాగస్వాములుగా ఉన్నారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబట్టే పనిలో పోలీసులు ఉన్నారు. లోటస్ ల్యాండ్ మార్క్‌లో మహ్మద్ రఫీని తన స్నేహితుడు సాగి వెంకట నరసింహరాజు హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రఫీ కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆరోపణలు చేస్తుండడంతో మరింత లోతుగా దర్యాప్తు చేయాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో నరసింహరాజుపై మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. అతడి స్నేహి తులు, పరిచయస్తులు నరసింహరాజు మంచి వాడని చెబుతున్నారు. నరసింహరాజు మందుల షాపును నిర్వహిస్తున్నాడు. ఆయన కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. విజయవాడలో ఉన్న మందుల షాపు వ్యవహారాలను బంధువులకు అప్పగించాడు. ఆయన నెలలో రెండు, మూడు సార్లు వచ్చి షాపు వ్యవహారాలను చూసుకు ంటాడు. పెనమలూరు మండలం తాడిగడపకు చెందిన మహ్మద్ రఫీతో పాఠశాల స్థాయి నుంచి స్నేహం ఉంది. అది మొన్నటి వరకు కొన సాగింది. రఫీ తాడిగడపలో మీ సేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్టు పోలీసులు చెబుతున్నారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్నేహపూర్వకంగా ఉండే ఈ రెండు కుటుంబాల మధ్య రఫీ హత్య చిచ్చు పెట్టింది. తనను తాను రక్షించుకునే ప్రయత్నంలోనే నరసింహరాజు రఫీని హత్య చేశాడని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. నరసింహరాజు తన భర్తతో మద్యం తాగించి చంపేశాడని రఫీ భార్య అజ్మీర ఆరోపిస్తోంది. ఆయనకు మద్యం తాగే అలవాటు లేదని స్నేహితులు చెబుత ున్నారు. పోలీసులు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. నరసింహరాజు ఎప్పుడు హైదరా బాద్ నుంచి వచ్చినా ఇద్దరూ కలుసుకుంటారని, రఫీ మద్యం తీసుకుని వెళ్తాడని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. రఫీ కుటుంబానికి నరసింహ రాజు అవసరమైనప్పుడు ఆర్థికసాయం చేస్తాడని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. రఫీ భార్య అజ్మీర మాత్రం వ్యాపార భాగస్వామ్యంతోనే హత్య చేశాడని ఆరోపిస్తోంది. నరసింహరాజు మెడికల్ షాపు నిర్వహిస్తున్నందున, ఇందులో రఫీ పెట్టుబడి పెట్టాడా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రఫీ కుటుంబానికి ఆర్థికసాయం చేసేవాడినని నరసింహరాజు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో చెప్పాడు. ఈ విష యాన్ని మాత్రం రఫీ కుటుంబం అంగీకరి ంచడం లేదని తెలిసింది. తన బావ, నరసిం ారాజు వ్యాపార భాగస్వాములుగా ఉన్నారని రఫీ బావమరిది చెబుతున్నాడు. వ్యాపారంలో ఉన్న వివాదాలను సెటిల్ చేసుకుందామని ఇంట ికి పిలిపించి, మద్యం తాగించి హత్య చేశాడని ఆరోపించాడు. హంతకుడికి పోలీసులు రాచమ ర్యాదలు చేస్తున్నారని, ఆవేశంలో చంపానని నరసింహరాజు చెబుతున్నదంతా అబద్ధమని కొట్టిపా రేస్తున్నాడు. ఉద్దేశపూర్వకంగా అతి క్రూరంగా చంపాడని తీవ్రమైన ఆరోపణలు చేశాడు.

డబ్బులు అడిగినందుకే హత్య

-రఫీ భార్య అజ్మీర

వ్యాపార భాగస్వామ్యంలో ఉన్న డబ్బులు అడిగినందుకు నరసింహరాజు నా భర్తను హత్య చేశాడు. నన్ను, పిల్లలను రోడ్డున పడే లా చేశాడు. నా భర్త శవాన్ని చూడకుండా పోలీసులు అడ్డుకున్నారు. హత్య చేసిన వ్యక్తికి రక్షణ కల్పించి పిల్లలను, నన్ను అడ్డుకున్నారు. రఫీని నరసింహరాజు మో సం చేసి చంపేశాడు. పోలీసులు ముందుగా కేసు నమోదు చేయలేదు. మా బంధువు లంతా కలిసి గొడవ చేసిన తర్వాత కేసు నమోదు చేశారు. హంతకుడికి ఫోన్ మా ట్లాడుకునే వెసులుబాటును పోలీసులు కల్పి ంచారు. ఆయనను కలవడానికి బంధు వులను అనుమతించారు. మమ్మల్ని కనీసం స్టేషన్ లోపలకు రానివ్వలేదు. మా ఫిర్యా దును పోలీసులు పట్టించుకోలేదు. వారికి ఇష్టం వచ్చినట్టుగా రాసుకున్నారు. మేమంతా గట్టిగా నిలదీస్తే అప్పుడు మార్చారు.

వారంలోపే రైతుల ప్లాట్లు రిజిస్ట్రేషన్

రాజధాని రైతులకు సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ భరోసా



ప్లాట్ కేటాయింపు పత్రాన్ని అందజేస్తున్న సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి

వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల లోపలనే రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయి స్తామని సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్‌చంద్ రైతులకు భరోసా ఇచ్చారు. లాటరీలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులకు ఎక్కడా అంతరాయం లేకుండా సంబంధిత కాంపిటెంట్ అథారిటీ రిజిస్ట్రేషన్ చేయిస్తుందని చెప్పారు. విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో బుధవారం తొలిరోజు కార్యక్రమంలో గతంలో రిటర్నబుల్ ప్లాట్లు అందుకోనని రైతులకు లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించారు. ట్రయల్ రన్ అనంతరం ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. కాంపిటెంట్ అథారిటీలు ప్లాట్ల కేటాయింపు పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా సూర్యసాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ వారంలోపే రిజిస్ట్రేషన్లు చేయిస్తామన్నారు. మౌలిక సదుపాయాల పనులు డిసెంబర్ నుంచి ప్రారంభమవుతాయన్నారు. జీపీఎస్ బృందం గ్రామాల మ్యాప్‌ల ద్వారా ప్లాట్ల ప్రదేశాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తొమ్మిది గ్రామాలకు చెందిన 23 మంది రైతులకు 68 రిటర్నబుల్ ప్లాట్లను అందజేశారు. సీఆర్‌డీఏ ల్యాండ్స్ డైరెక్టర్ డి.ఎల్.ఎస్.రాజ కుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు డేవిడ్ రాజు, విశ్వేశ్వరనాయుడు, భీమారావు, స్వర్ణమేరి, సాయి శ్రీనివాసనాయక్, తదితరులు పాల్గొన్నారు. కాగా నవులూరు- 1, 2, నిడమర్రు - 1, 2లకు గురువారం మధ్యాహ్నం 2 గంల నుంచి 4 గంటల వరకు లాటరీ తీస్తారు. బోరుపాలెం, రాయపూడి - 1, నెక్కలు, నేలపాడు, వెలగపూడి, వెంటపాలెం, అనంతవరం గ్రామాలకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు లాటరీ తీయనున్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

- మధురానగర్ కాల్వ గట్టు వద్ద గొడవ
- ఇరిగేషన్, వీఎంసీ అధికారులపై దాడికి యత్నం
- పోలీస్ బందోబస్తు కోసం వెళ్తే మొండి చెయ్యి
- తొలగించిన తరువాత మరలా ఆక్రమణలు



కృష్ణుడి గుడి వద్ద గోడను తొలగించే ప్రయత్నం చేస్తున్న అధికారులు

మధురానగర్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ ఏరియా వీవీ నరసరాజు రోడ్డులోని కాల్వ గటు ఆక్రమణల కథ రోజుకో మలుపు తిరుగుతోంది. ఒకే ప్రాంతంలో రెండు ఫర్లాంగుల దూరంలో దసరా ఉత్సవాల పేరుతో తాత్కాలిక పందిర్లు వేసుకుని ఒక చోట అమ్మవారి విగ్రహం పెట్టి ఒకరు సిమెంట్ రాళ్లతో గోడలు కడితే, ఇంకోక చోట ఉత్సవాలు చేసిన ప్రాంతంలో అమ్మవారు వెలిసిందని గోడలు కట్టి హడావుడి చేశారు. ఈ రెండు తతంగాల మీద స్థానికుల నుంచి వీఎంసీ, ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడం మూడు రోజుల క్రితం వారు రావడం పాక్షికంగా తొలగించడం మరల సోమవారం వస్తామని వెళ్లడం జరిగింది. మరల బుధవారం ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ నేతృత్వంలో అధికారులు, వీఎంసీ అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ అధికారి రాంబాబు, టీపీవో రమణారెడ్డి సిబ్బందితో ఎస్కవేటర్‌లతో వచ్చి ప్రార్థనా మందిరాల పేరిట వేసిన తాత్కాలిక నిర్మాణాలను తొలగించారు. ఇదే రోడ్డులో ఫ్లైవోవర్ పక్కన ఆరెళ్ల క్రితం కట్టిన కృష్ణమందిరం వద్దకు అధికారులు వెళ్లారు. ఈ మూడు చోట్ల ఆక్రమణ దారులు పెద్ద ఎత్తున అధికారుల చర్యలకు అడ్డు తగిలారు. ఒక దశలో తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో అధికారులు ఈ రెండు ఆక్రమణలకు మధ్య కూత వేటు దూరంలో ఉన్న గుణదల పోలీస్ స్టేషన్‌కు వె ళ్లి బందోబస్తు అడిగారు. వారు తమకు పై నుంచి అనుమతి లేదని తప్పించుకున్నారు. దీంతో చేసేది లేక ఉద్రికత్తల మధ్య ఆక్రమణలను తొలగించారు. అధికారులు వెళ్లిన తరువాత ఆక్రమణదారులు మరల విగ్రహాలు పెట్టి పరదాలతో పందిరి వేశారు.

అమ్మవారి విగ్రహం మాయం

నేతాజీ రోడ్డు చివర కట్ట మీద భూమిలో వెలిసిన అమ్మవారి విగ్రహం రెండు రోజులుగా కనిపించడం లేదు. బుధవారం ఆక్రమణలు తొలగించడానికి వచ్చిన వీఎంసీ అధికారులకు అక్కడ వేరే చిన్న విగ్రహం ఉండటం గమనించారు. అమ్మవారి విగ్రహాన్ని పురావస్తు అధికారులు వచ్చి పరిశీలిస్తారని రెండు రోజుల క్రితం అధికారులు హెచ్చరించడంతో ఆక్రమణలకు పాల్పడిన వారే దాచేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

స్వచ్ఛతా అభియాన్ స్పెషల్ క్యాంపెయిన్

రైల్వే స్టేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైల్ చౌపాల్ పేరిట స్వచ్ఛతా అభియాన్ స్పెషల్ క్యాంపెయిన్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ ప్రయాణికులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రయాణికులు స్టేషన్‌లో పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల గురించి ప్రశంసించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ సౌకర్యాల కల్పనలో ప్రయాణికుల సహకార ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. అనంతరం ప్రయాణికులకు క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెస్‌లో దూసుకెళ్తున్న తెలుగు రాష్ట్రాల ప్లేయర్స్



విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : నగరంలోని సీతారామపురం ఐకాన్ పబ్లిక్ స్కూల్ వేదికగా జరుగుతున్న బీఎస్‌కేయూ ఫౌండేషన్ తొలి ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్‌లో తెలుగు రాష్ట్రాల ప్లేయర్స్ రెండో రోజు దూకుడు పెంచారు. నాలుగు రౌండ్ల పోరు ముగిసే నాటికి చాలా మంది క్రీడాకారులు నాలుగు పాయింట్లతో ముందంజ వేశారు. మాస్టర్స్‌తో పాటు రెండో బోర్డులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇంటర్నేషనల్ మాస్టర్ కౌత్సవ్ కుండు(2429), తమిళనాడుకు చెందిన రాజు ఎస్(1872) మధ్య అత్యంత ఆసక్తికరంగా మ్యాచ్ సాగగా, కౌత్సవ్ కుండు విజయం సాధించాడు. అనేక మంది ఇంటర్నేషనల్ మాస్టర్స్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఫిడే మాస్టర్ ఆదిత్య వరుణ్ గంప(2194), జ్ఞానసాయి సంతోష్(2078), తెలంగాణకు చెందిన ఫిడే మాస్టర్లు మట్టా వినయ్‌కుమార్(2159) నాలుగు పాయింట్లతో ముందంజలో నిలిచారు. క్రీడా పోటీలను టోర్నీ కన్వీనర్ షేక్ ఖాసీం, చీఫ్ ఆర్బిటర్ వసంత్‌కుమార్,టోర్నీ డైరెక్టర్ విత్తనాల కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

వరద బాధితులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద వరద బాధితులతో కలిసి ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ నియోజకవర్గంలో వరద బాధితులందరికీ పూర్తి స్థాయిలో ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ సీపీఎం బుధవారం ఆందోళనకు దిగింది. సుమారు ఆర్థిక సహాయం అందని 200 మంది బాధితులతో కలసి అజిత్‌సింగ్‌నగర్‌లోని నార్త్‌జోన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా కార్యాలయం ఆవరణలోకి నేతలు వరద బాధితులతో కలసి దూసుకెళ్లారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వరద సహాయం అందని బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్. బాబురావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు కాశీనాథ్, రమణారావు, కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం చౌకబారు రాజకీయాలు మానుకోవాలి : ఎమ్మెల్యే బొండా



సీపీఎం నేతలు కాలం చెల్లిన చౌకబారు రాజకీయాలు మానుకోవాలని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా ధ్వజమెత్తారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సీపీఎం నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరాన్ని ఫ్లాష్ ఫ్లడ్ వ ుంచె త్తింద ని, అయినా కూడా కూటమి ప్రభుత్వం ప్రజలకు సకాలంలో భోజనం, మంచినీరు, నిత్యావసర సరుకులను అందజేసి ఆదుకుందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా ఆహారాన్ని ఇళ్లకు సరఫరా చేసిన ఘనత సీఎం దక్కుతుందన్నారు. అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల పరిధిలోని ఎనిమిది డివిజన్లు కలిపి 70 వేల కుటుంబాలకు నేరుగా ఆర్థిక సహాయాన్ని బ్యాంకు ఖాతాల్లోకి వేయడం జరిగిందన్నారు. ఇంకా కొద్ది మందికి మాత్రం బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డుల్లో స్పష్టత లేనందున సహాయం అందడంలో జాప్యం జరిగినట్లు చెప్పారు. దీనిని ఆసరాగా చేసుకున్న సీపీఎం నేత బాబురావు అమాయక ప్రజలను రెచ్చగొట్టి రోడ్లపైకి తెచ్చి రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. ఆర్థిక సహాయం అందని ప్రజలు ఓర్పుగా ఉండాలని త్వరలోనే అందరి ఖాతాలకు డబ్బులు అందుతాయని సూచించారు.

ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో అక్రమాలు

- మాజీ ఎంపీ శ్రీధర్ కార్యవర్గంపై విచారణ చేయండి
- వ్యవస్థాపక అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 23 : ఎంపీ పదవి అడ్డం పెట్టుకుని కోటగిరి శ్రీధర్ దౌర్జన్యం చేసి వైసీపీ ప్రభుత్వంలో ఆంధ్ర ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో చొరబడి అక్రమ రీతిలో ఎన్నికలు నిర్వహించారని, ఇకనైనా వారి ఆగడాలకు చంద్రబాబు ప్రభుత్వం, శాప్ కల్పించుకుని అడ్డుకట్ట వేయాలని, తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. విజయవాడలో ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ అక్రమాలపై విచారణ కమిటీ వేయాలన్నారు. క్రికెట్ అసోసియేషన్ తరహాలో తమ అసోసియేషన్‌ను సైతం వైసీపీ నేతల కబంధ హస్తాల నుంచి విముక్తి కలిగించాలని సీఎం చంద్రబాబును అభ్యర్థించారు. మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, డేనియల్ ప్రదీప్‌లు శాప్, ఫుట్‌బాల్ అసోసియేషన్‌లలో ప్రాథమిక సభ్యత్వం లేకుండానే వివిధ జిల్లాల్లో దొంగ సొసైటీ రిజిస్ట్రేషన్లతో నమోదు చేశారని ఆరోపించారు. కోటగిరి శ్రీధర్‌తో సహా ఏడుగురు రెండు లేదా అంతకంటే ఎక్కువ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్లలో సభ్యులుగా ఉన్నారని కొసరాజు తె లిపారు. రగ్బీ అసోసియేషన్ కార్యదర్శిగా ఉన్న రామాంజనేయులు ఫుట్‌బాల్ అసోసియేషన్లో ఓటరుగా ఉండటం విడ్డూరమన్నారు. అక్రమ ప్రవేశాలను నిలుపుదల చేయించి నిజమైన క్రీడా సంఘాలకు జీవం పోయాలని కొసరాజు గోపాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో వివిధ జిల్లాల సభ్యులు ఎం సుబ్బరాజు, ఎన్ దీపక్, వీఎస్ఎస్ రామచంద్రరావులు పాల్గొన్నారు.